


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 22-08-2025 | సంపుటి - 24 | సంచిక - 106 | రూ : 4 | పేజీలు: 8


# గతంలో తెలుగువారికి మద్దతిచ్చారా?

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్న




- ఇప్పటికే 20 లక్షల టన్నులు సరఫరా చేసినట్లు వెల్లడి
- మరో 2 లక్షల టన్నులు రాబోతున్నట్లు స్పష్టీకరణ

దిల్లీ: ఉపరాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షాల తరపున పోటీ చేస్తున్న తెలుగు వ్యక్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి తెలుగు రాష్ట్రాల్లోని ఎంపీలు మద్దతివ్వాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. 'ఇదివరకు తెలుగువారైన వెంకయ్యనాయుడుకు మద్దతివ్వాలని రేవంత్‌రెడ్డి ఇలాగే పిలుపునిచ్చారా? లోక్‌సభ స్పీకర్‌గా తెలుగు వ్యక్తి జీఎంసీ బాలయోగిని పెట్టినప్పుడు కాంగ్రెస్ మద్దతు పలికిందా?' అని నిలదీశారు. కిషన్‌రెడ్డి గురువారం దిల్లీలో విలేకరులతో మాట్లాడారు. యూరియా ఇచ్చిన వారికి ఉపరాష్ట్రపతి **తరువాయి 2లో**

## పోలవరం వద్ద భారీగా గోదావరి ప్రవాహం..

### 48 రేడియల్ గేట్ల ద్వారా నీటి విడుదల

4లో



2లో

## పాక్‌లో జైషే కొత్త ఎత్తుగడ..

- ఈజీపైసా, సదాపే వాలెట్లతో ఉగ్ర నిధుల సమీకరణ
- ఎఫ్ఏటీఎఫ్ ఆంక్షలను తప్పించుకునేందుకే కొత్త మార్గం
- మసూద్ అజార్ కుటుంబం నియంత్రణలో వాలెట్లు
- 313 కొత్త శిబిరాల ఏర్పాటు లక్ష్యంగా ఆన్‌లైన్ చందాలు
- గల్ఫ్ దేశాల నుంచి భారీగా తరలివస్తున్న నిధులు

## జ్వరాలతో విలవిల..

# ఓపీలు కిటకిట

- రాష్ట్రంలో పెరుగుతున్న బాధితులు
- జాగ్రత్తలు పాటించాలని వైద్యుల సూచన



2లో

## మాదాపూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్..

### రూ.400 కోట్ల ప్రభుత్వ భూమి స్వాధీనం



2లో

- మాదాపూర్‌లోని జూబ్లీ ఎన్‌క్లేవ్‌లో భారీ కూల్చివేతలు
- రూ.400 కోట్ల విలువైన 16,000 చదరపు గజాల ప్రభుత్వ భూమి స్వాధీనం
- కబ్జాకు గురైన రెండు పార్కులు, రోడ్లకు విముక్తి
- ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు ఆధారంగా హైడ్రా చర్యలు
- కబ్జాదారులపై పోలీస్ కేసులు నమోదు చేస్తామని వెల్లడి



## ఢిల్లీ సీఎం రేఖా గుప్తాకు జెడ్ కేటగిరీ భద్రత

- ఈ రోజు ఉదయం సీఎం నివాసానికి చేరుకున్న సీఆర్పీఎఫ్ బలగాలు
- 24 గంటలూ రక్షణ కల్పించేందుకు అదనపు బలగాల మోహరింపు
- సీఎంపై దాడి ఘటనను సీరియస్ గా పరిగణించిన కేంద్రం

2లో

## కాళేశ్వరం కుంభకోణంలో కేసీఆరే ప్రధాన సూత్రధారి

- ఏ పార్టీలో అయినా వర్గపోరు సహజమేనన్న కొండా సురేఖ
- మోదీ వివక్ష వల్లే రాష్ట్రానికి యూరియా కరవు అని ఆరోపణ
- వరంగల్‌ను వరద రహిత నగరంగా తీర్చిదిద్దుతామని హామీ

2లో



## తప్పులు చేసి తప్పించుకోలేరు

- ఉద్యోగుల ఉల్లంఘనలపై సత్వర విచారణ
- కాలపరిమితితో కూడిన షెడ్యూలు జారీ చేసిన ప్రభుత్వం
- సాధారణమైతే మూడు నెలలు.. తీవ్రమైతే ఆరు నెలల గడువు

2లో

## విపక్షాల ఉప రాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్ రెడ్డి నామినేషన్..

* విపక్షాల ఉప రాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్ రెడ్డి నామినేషన్..

2లో



## భారత్‌లో.. మరింత విస్తరించండి

* రష్యా కంపెనీలకు జైశంకర్ ఆహ్వానం



2లో



# మాదాపూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్..

**హైదరాబాద్:** హైదరాబాద్, మాదాపూర్‌లో ప్రభుత్వ భూములపై కన్నేసిన కబ్జాదారులకు హైడ్రా గట్టి షాక్ ఇచ్చింది. భారీ ఆపరేషన్ చేపట్టి, సుమారు రూ.400 కోట్ల విలువైన అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంది. శేరిలింగంపల్లి మండలం పరిధిలోని జూబ్లీ ఎన్‌క్లేవ్‌లో ఈ కూల్చివేతలు జరిగాయి. మొత్తం 16,000 చదరపు గజాల విస్తీర్ణంలోని అక్రమ కట్టడాలను హైడ్రా అధికారులు జేసీబీల సహాయంతో నేలమట్టం చేశారు. ఈ స్థలంలో కబ్జాకు గురైన 8,500 చదరపు గజాల విస్తీర్ణంలోని రెండు పార్కులు, 5,000 చదరపు గజాల రోడ్లతో పాటు, 300 గజాల ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన హోటల్ షెడ్లను కూడా తొలగించారు. 'ప్రజావాణి' కార్యక్రమానికి వచ్చిన ఒక ఫిర్యాదు ఈ భారీ ఆపరేషన్‌కు కారణమైంది. జూబ్లీ ఎన్‌క్లేవ్ లేఅవుట్‌లోని పార్కును జైహింద్ రెడ్డి అనే వ్యక్తి కబ్జా చేశారంటూ స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, ఆక్రమణలు నిజమేనని నిర్ధారించుకున్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు గురువారం ఈ కూల్చివేతలను చేపట్టారు. భూమిని స్వాధీనం చేసుకున్న అనంతరం, పార్కుల చుట్టూ అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ స్థలం అని తెలిపే బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ కబ్జాలకు పాల్పడిన వారిపై పోలీస్ కేసులు కూడా నమోదు చేయనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ లేఅవుట్‌కు 1995లో అనుమతులు రాగా, 2006లో ప్రభుత్వం దీనిని రెగ్యులరైజ్ చేసింది.

## కాళేశ్వరం కుంభకోణంలో కేసీఆరే ప్రధాన సూత్రధారి: కొండా సురేఖ

**హైదరాబాద్:** బీఆర్ఎస్, బీజేపీలపై తెలంగాణ మంత్రి కొండా సురేఖ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ రెండు పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు విష ప్రచారం చేస్తున్నాయని ఆమె మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు ఉన్నాయంటూ విపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని ఆమె తోసిపుచ్చారు. ఏ పార్టీలోనైనా వర్గపోరు సహజమేనని, సమయం వచ్చినప్పుడు అవి బయటపడతాయని, వాటిని అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. ప్రధాని మోదీకి మొదటి నుంచి తెలంగాణపై వివక్ష ఉందని, అందుకే రాష్ట్రానికి యూరియా కేటాయింపుల్లో అన్యాయం చేస్తున్నారని సురేఖ ఆరోపించారు. యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, రాష్ట్రం నుంచి గెలిచిన 8 మంది బీజేపీ ఎంపీలు కేంద్రాన్ని నిలదీయలేకపోతున్నారని విమర్శించారు. వారికి మోదీ భజనపై ఉన్న శ్రద్ధ రైతుల సమస్యలపై లేదని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన నివేదికతో గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి బట్టబయలైందని మంత్రి సురేఖ అన్నారు. ఈ కుంభకోణానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆరే ప్రధాన సూత్రధారి అని నివేదిక స్పష్టం చేసిందని ఆరోపించారు. నిజాలు బయటపడటంతో బీఆర్ఎస్ నేతలు కల్లబొల్లి మాటలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పిలుపునిచ్చిన ఓటు చోరీ ఉద్యమానికి దేశవ్యాప్తంగా విశేష స్పందన వస్తోందని, దొంగ ఓట్లతోనే బీజేపీ అనేక రాష్ట్రాల్లో గెలుస్తోందని ఆమె ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని కొండా సురేఖ తెలిపారు. నాలాల ఆక్రమణలే నగరం ముంపునకు గురవడానికి ప్రధాన కారణమని గుర్తించామని, వాటిని తొలగించేందుకు డీపీఆర్ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. త్వరలోనే వరంగల్‌ను వరదలు లేని నగరంగా తీర్చిదిద్దుతామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికే అండగా నిలుస్తారని ఆమె స్పష్టం చేశారు.

## పాక్‌లో జైషే కొత్త ఎత్తుగడ... డిజిటల్ హవాలాతో ఉగ్ర

**ఢిల్లీ :** ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతున్నామని ప్రపంచానికి చెబుతున్న పాకిస్థాన్, తెరవెనుక ఉగ్రసంస్థలకు అండగా నిలుస్తున్న తీరు మరోసారి బయటపడింది. అంతర్జాతీయ ఆర్థిక కార్యదళం (ఎఫ్ఏటీఎఫ్) ఆంక్షల నుంచి తప్పించుకునేందుకు, జైషే మహమ్మద్ (జైషే) ఉగ్రవాద సంస్థ 'డిజిటల్ హవాలా' అనే కొత్త మార్గాన్ని ఎంచుకున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. టెక్నాలజీని వాడుకుంటూ ఆన్‌లైన్ వేదికగా ఉగ్ర కార్యకలాపాలకు నిధులను సమీకరిస్తున్నట్లు వెల్లడైంది. పాకిస్థాన్‌లో సులభంగా అందుబాటులో ఉండే ఈజీపైసా, సదాపే వంటి డిజిటల్ వాలెట్లను ఈ ఉగ్ర ముఠా తమ కార్యకలాపాలకు అస్త్రంగా మార్చుకుంది. జైషే అధినేత మసూద్ అజార్ కుమారుడు అబ్దుల్లా, ఖైబర్ ప్రావిన్స్ కమాండర్ సయ్యద్ సఫ్దార్ పేర్ల మీద ఉన్న ఖాతాలతో పాటు దాదాపు 250 ఇతర వాలెట్లను ఈ డిజిటల్ హవాలా కోసం చురుగ్గా వినియోగిస్తున్నట్లు తెలిసింది. ఈ వాలెట్లకు వస్తున్న నిధుల మూలాలను కప్పిపుచ్చేందుకు, డబ్బును తరచూ వేర్వేరు ఖాతాలకు బదిలీ చేస్తూ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఒకవైపు ఉగ్రవాద నిర్మూలనకు కట్టుబడి ఉన్నామని పాక్ ప్రభుత్వం చెబుతున్నా, గతంలో భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో ధ్వంసమైన జైషే శిక్షణా కేంద్రాల పునర్నిర్మాణానికి నిధులు సమకూరుస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా, కొత్తగా 313 శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసే లక్ష్యంతో, ఆన్‌లైన్ ద్వారా చందాలు సేకరించి ఏకంగా 391 కోట్ల పాకిస్థానీ రూపాయలను సమీకరించాలని జైషే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నిధులను ఆయుధాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, విలాసవంతమైన కార్ల కొనుగోలుతో పాటు మసూద్ అజార్ కుటుంబ నిర్వహణకు వాడుతున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఈ డిజిటల్ హవాలా నెట్‌వర్క్‌కు ప్రధానంగా గల్ఫ్ దేశాల నుంచి నిధులు వెల్లువెత్తుతున్నాయని, జైషే సేకరిస్తున్న మొత్తం నిధుల్లో 80 శాతం ఈ మార్గంలోనే వస్తున్నాయని నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఎఫ్ఏటీఎఫ్ నిబంధనలు పాటిస్తున్నామని పాక్ చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఉగ్రవాద సంస్థలు టెక్నాలజీని వాడుకుని తమ కార్యకలాపాలను యథేచ్ఛగా కొనసాగిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

## విపక్షాల ఉప రాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్ రెడ్డి నామినేషన్..

**ఢిల్లీ :** దేశ ఉపరాష్ట్రపతి పదవికి జరుగుతున్న ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారింది. తెలంగాణకు చెందిన ప్రముఖ న్యాయకోవిదుడు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి విపక్ష ఇండియా కూటమి తరఫున బరిలో నిలిచారు. ఈరోజు ఆయన తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీతో పాటు కూటమికి చెందిన 20 మంది ఎంపీలు ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ సంతకాలు చేయడం విశేషం. జస్టిస్ సుదర్శన్ రెడ్డి స్వస్థలం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఆకుల మైలారం గ్రామం. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందిన ఆయన, న్యాయవ్యవస్థలో అంచెలంచెలుగా ఎదిగారు. 2005 నుంచి 2007 వరకు గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొంది, 2007 నుంచి 2011 వరకు సుమారు నాలుగున్నరేళ్ల పాటు సేవలందించారు. అత్యున్నత న్యాయస్థానం నుంచి పదవీ విరమణ చేశాక, గోవా రాష్ట్రానికి లోకాయుక్తగా కూడా ఆయన పనిచేశారు. జగదీప్ ధన్ఖడ్ ఇటీవల ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. అధికార ఎన్డీఏ కూటమి తమ అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్‌ను నిలిపిన సంగతి విదితమే.

## ఢిల్లీ సీఎం రేఖా గుప్తాకు జెడ్ కేటగిరీ భద్రత

**ఢిల్లీ:** ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై జరిగిన దాడి ఘటనను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన ఈ ఘటనపై స్పందిస్తూ.. రేఖా గుప్తాకు జెడ్ కేటగిరీ భద్రత కల్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ రోజు ఉదయం సీఆర్పీఎఫ్ బలగాలు సీఎం నివాసానికి చేరుకున్నాయి. సీఎం భద్రత బాధ్యతలను ఢిల్లీ పోలీసుల నుంచి స్వీకరించాయి. సీఎం వ్యక్తిగత భద్రతతో పాటు సీఎం నివాసానికి, క్యాంపు కార్యాలయానికి 24 గంటలూ భద్రత కల్పించేందుకు అధికారులు అదనపు బలగాలను మోహరించారు. జెడ్ కేటగిరీ భద్రతలో 20 మందికి పైగా సిబ్బంది, స్పెషల్ గార్డులు, డ్రైవర్లు, ఎస్కార్ట్ వాహనాలను ముఖ్యమంత్రి రేఖా గుప్తాకు సమకూర్చారు. కాగా, బుధవారం ఉదయం ఢిల్లీ సీఎం రేఖా గుప్తా 'జన్ సున్ వాయి' కార్యక్రమం నిర్వహిస్తుండగా ఆమెపై దాడి జరిగిన విషయం తెలిసిందే. తన సమస్యలు చెప్పుకోవడానికి వచ్చినట్లు నటించిన ఓ వ్యక్తి ఆమె చెంపపై కొట్టాడు. వెంటనే స్పందించిన సీఎం సెక్యూరిటీ సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకున్నారు. సీఎంను ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు.

## భారత్‌లో మరింత విస్తరించండి: రష్యా కంపెనీలకు జైశంకర్ ఆహ్వానం

**ఢిల్లీ :** అంతర్జాతీయంగా మారుతున్న సమీకరణాలు, భౌగోళిక రాజకీయ సవాళ్ల నడుమ భారత్, రష్యాలు కలిసికట్టుగా కొత్త మార్గాలను అన్వేషించాలని భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ పిలుపునిచ్చారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేయాలని అమెరికా నుంచి తీవ్ర ఒత్తిడి ఎదురవుతున్న తరుణంలో, ఆయన మాస్కోలో పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనలో భాగంగా రష్యా కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ఆయన ప్రత్యేకంగా ఆహ్వానించారు. మాస్కోలో రష్యా ఫస్ట్ డిప్యూటీ ప్రైమ్ మినిస్టర్ డెనిస్ మంటురోవ్‌తో జై శంకర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య వాణిజ్యం, ఆర్థికం, సాంకేతికత, సాంస్కృతిక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న క్లిష్ట పరిస్థితులను అధిగమించేందుకు ఇరు దేశాలు సృజనాత్మకంగా ఆలోచించి, ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని జై శంకర్ గుర్తుచేశారు. 'మేక్ ఇన్ ఇండియా' వంటి కార్యక్రమాల ద్వారా విదేశీ పెట్టుబడులకు, వాణిజ్యానికి తమ ప్రభుత్వం కొత్త ద్వారాలు తెరిచిందని వివరించారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకుని, రష్యా కంపెనీలు భారత్‌లో తమ వ్యాపార కార్యకలాపాలను విస్తరించుకోవాలని సూచించారు.

## నాగార్జునసాగర్ జలాశయానికి భారీగా వరద ప్రవాహం..

**శ్రీశైలం :** నాగార్జున సాగర్ జలాశయానికి భారీగా వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. దీంతో 26 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 3,92,997 క్యూసెక్కులు కాగా.. ఔట్‌ఫ్లో 4,73,053 క్యూసెక్కులుగా ఉంది. నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 583 అడుగులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ 312.04 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 291.66 టీఎంసీలుగా నమోదైంది.

* **శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద**

శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం మరింత పెరుగుతోంది. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 4,98,022 క్యూసెక్కులు వస్తోంది. జలాశయం నుంచి 5,13,540 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 30,000 క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 29,595 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 10 స్పిల్‌వే గేట్లను 18 అడుగులు ఎత్తి.. 4,18,630 క్యూసెక్కులు నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 881.60 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 197.01 టీఎంసీలుగా నమోదైంది.

## తప్పులు చేసి తప్పించుకోలేరు

హైదరాబాద్: విధి నిర్వహణలో నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘన, అక్రమాలకు పాల్పడిన ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులపై విచారణలను వేగవంతం చేసేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ప్రభుత్వ ఉద్యోగులపై వచ్చే సాధారణ ఫిర్యాదుల్లో శాఖాపరమైన అధికారులు మూడు నెలల్లో, తీవ్రమైన ఆరోపణల విషయంలో విచారణ కమిషన్లు ఐదారు నెలల్లో విచారణ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఆరోపణలు రుజువైతే వెంటనే శిక్షను ఖరారు చేయాలని సూచించింది. విచారణకు నిర్ణీత గడువు విధిస్తూ.. ఎవరైనా వేగంగా పూర్తిచేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అందుకు సంబంధిత విచారణాధికారి/సంస్థ బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొంది. క్రమశిక్షణ చర్యల కేసులను ప్రభుత్వ విభాగాల కార్యదర్శులు ఎప్పటికప్పుడు సమీక్షించడంతో పాటు.. నిర్ణీత గడువు దాటిన తరువాత పెండింగ్ కేసుల వివరాల నివేదికను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, ముఖ్యమంత్రికి అందించాలని సూచించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సమగ్ర మార్గదర్శకాలతో ఉత్తర్వులు జారీ చేశారు. క్రమశిక్షణ చర్యల దస్త్రం ఏ అధికారి వద్దా మూడు రోజులకు మించి ఉండటానికి వీల్లేదని, మంత్రులకు పంపించాల్సిన కేసుల విషయంలో వారం రోజుల్లోనే ఆ ప్రక్రియ పూర్తి చేయాలని నిర్దేశించారు.

**ఇవీ నిబంధనలు..**

అక్రమాలు బయటపడిన తర్వాత సంబంధిత ఉద్యోగి/అధికారిపై అభియోగాల నమోదులో జాప్యం చేయకూడదు. వెంటనే ప్రాథమిక విచారణ పూర్తిచేయాలి. తీవ్రమైన ఉల్లంఘనలు, అక్రమాలు జరిగాయని తేలితే.. అభియోగాలు నమోదు చేయాలి. కొన్నిసందర్భాల్లో జాప్యంతో అభియోగాల నమోదులో ఆ ఉద్యోగి/పింఛనుదారు శిక్ష నుంచి తప్పించుకుంటున్నారు.

అభియోగాలు నమోదు చేసేటప్పుడు సాధారణ పదజాలంతో కాకుండా.. నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ స్పష్టమైన అభియోగాలు, తీవ్రత వివరాలు పేర్కొనాలి. అభియోగాలకు సంబంధించిన అన్ని ఆధారాలను విచారణాధికారి/సంస్థ తనిఖీ చేసి, సాక్షులతో కూడిన వివరాలు నమోదు చేయాలి. వీటిని ఆరోపణలు ఎదుర్కొంటున్నవారికి ఇచ్చి, లిఖితపూర్వక సమాధానం తీసుకోవాలి.

ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగి ఇచ్చిన సమాధానాన్ని సీనియర్ అధికారి ఆధ్వర్యంలో అన్ని రికార్డులతో పరిశీలించి సరిచూసుకోవాలి. తద్వారా చర్యలు తీసుకునేందుకు ముందుకు వెళ్లాలా? వద్దా నిర్ణయం తీసుకోవచ్చు. లభించిన ఆధారాలు.. చర్యలకు సరిపోతాయో లేదో తెలుస్తుంది.

విచారణ సంస్థ ముందు ప్రజెంటింగ్ అధికారి ఆ విచారణ వివరాలు సమగ్రంగా సమర్పించాలి. విచారణ ఎదుర్కొంటున్న అధికారి కన్నా.. ప్రజెంటింగ్ అధికారి సీనియర్ అయి ఉండాలి.

క్రమశిక్షణ చర్యల అధికారులు విచారణ సంస్థకు సకాలంలో రికార్డులు పంపించడం లేదు. అపాయింట్‌మెంట్ ఆర్డర్ సహా అన్ని వివరాలు అడిగిన వెంటనే పంపాలి.

విభాగాధిపతులు రికార్డులను సచివాలయ విభాగానికి పంపించే ముందు ఒకసారి పరిశీలించాలి. అత్యవసరం కాదన్నట్లు కిందిస్థాయి అధికారులు పక్కన పెట్టడం సరికాదు. కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపించి ఈ కేసులను వేగంగా పరిష్కరించాలి.

అభియోగాలు ఎదుర్కొంటున్న అధికారిపై ప్రాథమిక, పూర్తిస్థాయి నివేదిక వచ్చిన ఏడాదిలోగా చర్యలు పూర్తిచేయాలి. ఒకవేళ తీవ్ర జాప్యం జరిగితే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సంబంధిత మంత్రికి పంపించి, నిర్ణీత గడువులోగా అనుమతి తీసుకుని చర్యలు తీసుకోవాలి.

విశ్రాంత ఉద్యోగుల విషయాల్లో టీజీపీఎస్సీ నుంచి నివేదిక వచ్చిన వారం రోజుల్లో నిర్ణయం తీసుకుని పింఛనుపై పెనాల్టీ విధించాలి.

భారీ సంఖ్యలో సాక్షుల విచారణ, రికార్డులు, తదితరాలను పరిశీలించాల్సిన సమయంలో సంబంధిత అధికారుల నుంచి ముందస్తుగా లిఖితపూర్వక అనుమతులు తీసుకోవాలి. ఉద్యోగుల పదవీ విరమణ వయసును పరిగణనలోకి తీసుకుంటూ విచారణ వేగంగా పూర్తిచేయాలి.

## గతంలో తెలుగువారికి మద్దతిచ్చారా?

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల్లో మద్దతిస్తామని కేటీఆర్ చేసిన ప్రకటనను విలేకరులు ప్రస్తావించగా కిషన్‌రెడ్డి మండిపడ్డారు. 'ఆయన మద్దతు ఎవరు కోరారు? మాకు వారి మద్దతే అవసరం లేదు. రైతులకు యూరియా సరఫరా చేస్తున్నది కేంద్రమే తప్ప.. రాహుల్‌గాంధీ కానీ, రేవంత్‌రెడ్డి కానీ బయటి నుంచి తేవడం లేదు' అని ఎద్దేవా చేశారు. ఎన్డీయే అభ్యర్థికి మద్దతివ్వాలని అన్ని పార్టీలను కోరుతున్నప్పుడు భారాసను ఎందుకు అడగడం లేదు? అని విలేకరులు అడిగిన మరో ప్రశ్నకు స్పందిస్తూ.. 'అడుగుతాం.. కానీ యూరియా ఇస్తేనే మద్దతిస్తామనడం బాగాలేదు. ఇది చిన్నపిల్లలాటలా ఉండకూడదు' అని అన్నారు.

అడ్డగోలు మాటల వల్లే యూరియా సమస్య: 'రాష్ట్రంలో యూరియా కొరత ఉందంటూ కాంగ్రెస్ మంత్రులు రోజూ అడ్డగోలుగా మాట్లాడటం వల్లే.. కొందరు వ్యాపారులు అక్రమంగా నిల్వ చేస్తున్నారు. మరికొందరు దారి మళ్లిస్తున్నారు. అంతర్జాతీయంగా ఉన్న యుద్ధ వాతావరణం వల్ల కొంత సమస్య తలెత్తిన మాట వాస్తవమైనా.. కేంద్రం రాష్ట్రానికి అవసరమైనంత యూరియా సరఫరా చేసింది. ఈ ఏడాది 20 లక్షల టన్నుల యూరియా అవసరం కాగా, గత ఏడాది మిగిలిన నిల్వలు, ఈ ఏడాది కొత్తగా పంపింది కలుపుకొని తెలంగాణకు ఇప్పటికే 20 లక్షల టన్నులు అందుబాటులోకి వచ్చింది. ఇప్పుడు మరో 2 లక్షల టన్నులు రాబోతోంది. కరైకల్ పోర్టు నుంచి 10 వేల టన్నులు తెలంగాణకు ఇవ్వాలని కేంద్రమంత్రి జేపీ నడ్డా ఆదేశించారు.

## జ్వరాలతో విలవిల.. ఓపీలు కిటకిట

హైదరాబాద్: రాష్ట్రంలో దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, నీరసం, జ్వరంతో మంచం పడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురిసి కాస్త తగ్గుముఖం పట్టడంతో ఒక్కసారిగా సీజనల్ వ్యాధులు పంజా విసురుతున్నాయి. హైదరాబాద్‌లోని ఫీవర్ ఆసుపత్రి ఓపీలో సాధారణంగా రోజుకు 500 మంది వరకు వస్తుంటారు. గత వారం పది రోజులుగా ఆ సంఖ్య 750కి చేరింది. పిల్లల ఆసుపత్రి నిలోఫర్‌లో సాధారణంగా ఓపీలో 1,000 1,200 మంది వస్తుంటారు. కానీ, ఇప్పుడు రోజుకు 1,6001,800 మంది వస్తున్నారు. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో ఆగస్టులో మొత్తం జ్వరం కేసులు 1,345 రాగా ఇందులో 48 డెంగీ, 5 మలేరియా. ఇక సూర్యాపేట ప్రభుత్వ బోధనాసుపత్రిలో గురువారం 37 జ్వరం కేసులు రాగా ఇందులో రెండు డెంగీగా నిర్ధారించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆసుపత్రుల్లోనూ ఓపీకి వరుస కట్టే వారి సంఖ్య దాదాపు 30 శాతం పెరిగింది.

# ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలి..

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సహాయం అందించాలని వైద్యశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. గురువారం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలోని మందులు అందించే గది, రక్త పరీక్ష కేంద్రం, ఇన్ పేషెంట్ వార్డ్ గర్భిణీ స్త్రీల వార్డ్, మందులు నిల్వ చేసే స్టోర్ రూమ్ ను పరిశీలించారు. ఇన్ పేషెంట్ వార్డ్ లో ఉన్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఔట్ పేషెంట్ వివరాలు, సిబ్బంది వివరాలు, మందులు, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ ను తనిఖీ చేశారు. కుక్క కాటు ఇచ్చే వ్యాక్సినేషన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన చికిత్స అందించాలని, వైద్యులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని,, ఆసుపత్రిని నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు., ఔషధ నిల్వలు స్టాక్ పెట్టుకోవాలన్నారు. ఆసుపత్రిలో రోగులకు



శుచికరమైన బలవర్ధకమైన ఆహారం ఇవ్వాలని సూచించారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది ఎందరు ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. వివిధ సమస్యలతో ప్రభుత్వాసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు.ఈ తనిఖీలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ రాధా మోహన్, డ్యూటీ డాక్టర్లు , సిబ్బంది పాల్గొన్నారు.

## మేము సైతం..

**కోటి గింజలు, సేకరణ నాటడమే మా లక్ష్యం.**

**మహిళలు కోటి గింజల సేకరణ, నాటే కార్యక్రమం**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: "ప్రకృతి హరిత దీక్ష , భావితరాలకు రక్ష" అనే నినాదంతో పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవుతున్నారు."ప్రకృతిని మనం కాపాడితే... ప్రకృతి మనల్ని కాపాడుతుంది" అనే సందేశాన్ని వ్యాప్తి చేస్తూ మహిళలు కూడా కోటి గింజల సేకరణ, నాటే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు.గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ఇల్లెందు క్రాస్ రోడ్ సమీపంలో రేగల్ల రోడ్ వెంబడి ఫారెస్ట్ పరిసరాల్లో అశోక, మామిడి, జీడిమామిడి, ఈత, అడవి బాదం గింజలు నాటారు. ఈ సందర్భంగా భారతి, భాగ్యలక్ష్మి, రాజకుమారి, జ్యోతి, ఆటో డ్రైవర్ మిత్రుడు ,కొత్తగూడెం పి.ఎల్.విలు, ఏడుకొండల ఎస్.హెచ్. గ్రూప్ సభ్యులకు అభినందలు తెలిపిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన మన కీ బాత్ కె ఎన్ రాజశేఖర్ ప్రకృతి హరిత దీక్ష, గ్రీన్ మోటార్ వెహికిల్ గార్డెన్ వ్యవస్థాపకుడు సింగరేణియన్ భద్రాద్రి కొత్తగూడెం ప్రత్యేకంగా ప్రశంసలు అందుకున్నారు.

## నీట్ విద్యార్థిని సన్మానించిన ఎస్ఐ నాగుల్ మీరా.,



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: అమర్ సింగ్ తండా కు చెందిన జర్పుల బలరాంను కొమరారం ఎస్సై నాగుల్ మీరా మంచి ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగుల్ మీరా జర్పుల బలరాంను ఘనంగా సన్మానించారు ఈ మేరకు ఆయన మాట్లాడుతూ విద్యార్థులు యువత చెడు అలవాట్లకు లోను కాకుండా చదువుపై శ్రద్ధ ఉంచాలని కోరారు.

## టేకులపల్లి కోనుగోలు కేంద్రంలో వసతులు కల్పన నూతన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని వినతి



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: మార్కెటింగ్ శాఖ అడిషనల్ సెక్రెటరి జీ. లక్ష్మీ హైదరాబాద్ బిఆర్కే భవన్ నందు మర్యాద పూర్వకంగా కలిసి ఇల్లందు వ్యవసాయ మార్కెట్ పరిధిలో గల టేకులపల్లి కోనుగోలు కేంద్రంలో నూతన వసుతుల కల్పనకు సంబంధించి,నిర్మాణాలకు అనుమతి ఇవ్వాలస్సిందిగా ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య కోరారు. వారి వెంట ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు, కొండాయిగూడెం సొసైటి చైర్మెన్ ధనియాకుల హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

## మినీ వాటర్ ప్లాంట్ అందజేత



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలోని ఆవునూర్ ప్రాథమిక పాఠశాలలో 1982`83లో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలకు మినీ వాటర్ ప్లాంట్‌ను అందజేశారు. పాఠశాలపై ఉన్న మక్కువతో విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు గాను రూ.40వేలతో కొనుగోలు చేసిన ఈ వాటర్ ప్లాంట్‌ను పాఠశాలకు అందించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాముల స్వామి, పిఎసిఎస్ డైరెక్టర్ ఆవునూరి సతీష్, చందర్ రావు, స్థానిక నాయకులు గుండం నర్సయ్య, సొల్ల క్రాంతి కుమార్, వేణు, శ్రీనివాస్, రాజు తదితరులున్నారు.



## వయోవృద్ధులకు చట్టాలు అండగా ఉన్నాయి

**జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి,**

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు : అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక గోవింద్ సెంటర్ నందుగల పెన్షన్ భవన్ నందు ఇల్లందు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం న్యాయ చైతన్య సదస్సు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమం ఉద్దేశిస్తూ వారు మాట్లాడుతూ వయోవృద్ధులైన తల్లిదండ్రులను వారి కొడుకులు, కూతుర్లు, సంరక్షణ అందించకపోవడం వలన వయో వృద్ధులైన తల్లిదండ్రులు నిరాధారణకు గురవుతున్నారని, ఆస్తులు పంచుకుంటున్నారే గాని వారికి ప్రేమను, సంరక్షణను అందించలేకపోతున్నారన్నారు. నిరాధారణకు గురైన వయోవృద్ధులు చట్టాలు రూపొందించబడ్డాయన్నారు. జిల్లా కలెక్టర్ , సబ్ కలెక్టర్ అర్జీ పెట్టుకున్నట్లయితే ఎంక్వైరీ నిర్వహించి అట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటారన్నారు. అంతేకాకుండా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను గాని మండల న్యాయ సేవ అధికార సంస్థను గాని, ఆశ్రయించినట్లయితే ఎటువంటి రుసుం లేకుండా అన్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు, సెక్షన్ 144 భారతీయ నాగరిక సురక్ష సంహిత సెక్షన్ ద్వారా మనోవర్తి పొందవచ్చు అని తెలిపారు.. ఈ కార్యక్రమంలో జడ్జి తో పాటు ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాంపెల్లి ఉమామహేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి కీర్తి కార్తిక్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు దాసరి స్వామి దాసు, తదితరులు పాల్గొన్నారు.

## వరద నీరును వెంటనే క్లియర్ చేసి సమస్యను పరిష్కరించాలి

**ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : కాలనీ లో రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరును వెంటనే క్లియర్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జల మండలి అధికారులకు సూచించారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో ఆల్విన్ కాలనీ డివిజన్ శంషిగుడా పరిధిలోని మహంకాళి నగర్ కాలనీ లో డ్రైనేజీ పొంగి వరద నీరు రోడ్డుపై ప్రవహిస్తూ ఇబ్బందిగా ఉందని కాలనీ వాసులు సమస్యను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా కార్పొరేటర్ కాలనీ లో పాదయాత్ర చేసి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రగతి నగర్ నుండి నుండి వస్తున్న డ్రైనేజీ నీరును ఎల్లమ్మచెరువులో కలవకుండా దారి మళ్లించే విధంగా జరుగుతున్న పైప్ లైన్ నిర్మాణ పనులు పూర్తయితే సమస్య శాశ్వతంగా పరిష్కరించబడుతుందని తెలియచేసారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ వర్షాలు కురవడంతో కాలనీ లలో వరద నీరు రోడ్లపై ప్రవహిస్తూ సమస్యలు వస్తున్నాయని, వాటిని కూడా జి.ఎచ్.ఎం.సి, మాన్ సున్ , హైడ్రా సిబ్బంది సకాలంలో స్పందించి వెంటనే పరిష్కరిస్తున్నారని అన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు కలిగిన,(ఎలక్ట్రికల్,



రోడ్డు, డ్రైనేజీ, మంచి నీటి) వంటి సమస్య లు ఎదురైన, వెంటనే సంబంధిత అధికారులకు గాని, మాకు గాని, మా కార్యాలయంకు గాని సంప్రదించాలని తెలియచేసారు. అదేవిధంగా వర్షాలను దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతాల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు , మాన్ సున్ ఎమర్జెన్సీ టీమ్స్ , డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎటువంటి ఇబ్బంది లేకుండ చూడలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో లద్దే నాగరాజు, దాతి రమేష్, నిరంజన్, షౌకత్ అలీ మున్నా, గురునాథ్, కాశప్ప, కాంతప్ప, విజయ్, రాకేష్, హీరా లాల్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.




## డ్యూడెనల్ పర్ఫొరేషన్ రోగికి యశోద శాస్త్ర చికిత్స..

ప్రజా స్ఫూర్తి, నల్లగొండ: అత్యాధునిక గ్యాస్ట్రో ఎంటిరాలజీ సర్జరీ ద్వారా డ్యూడెనల్ పర్ఫొరేషన్ రోగి ప్రాణాలను మలక్ పేట, యశోదా ఆసుపత్రి వైద్య బృందం కాపాడిందని సర్జికల్ గ్యాస్ట్రి ఎంటిరాలజీ వైద్య నిపుణులు డా. వెంకటేష్ శ్రీపతి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని మనోరమ హోటల్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నల్లగొండ పట్టణానికి చెందిన చెందిన బుర్రా రంజిత్ అనే రోగి మూడు రోజులుగా కడుపు ఉబ్బరం,జ్వరం,విరేచనాలతో బాధపడుతూ, ఇతర స్థానిక ఆసుపత్రుల్లో ఆక్యూట్ గ్యాస్ట్రోఎంటరైటిస్, పైలోనెఫ్రైటిస్, పారాలిటిక్ ఐలియస్ అనుమానాలతో చికిత్స పొందాడని పేర్కొన్నారు. శ్వాసలో ఇబ్బంది పెరగడంతో, అతన్ని హైదరాబాద్ మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి రిఫర్ చేశారని తెలిపారు.డ్యూడెనల్ పర్ఫొరేషన్ డ్యూడెనమ్ గోడలో కడుపు తరువాత ఉండే చిన్న ప్రేగు మొదటి భాగంలో రంధ్రం ఏర్పడినప్పుడు సంభవిస్తుంది. దీని వల్ల ప్రేగులోని పదార్థం కడుపు లోపలి భాగంలోకి లీకై తీవ్రమైన ఇన్ఫెక్షన్ (పెరిటోనిటిస్) వస్తుందన్నారు. చాలా సందర్భాల్లో డ్యూడెనల్ పర్ఫొరేషన్ ఆకస్మికంగా తీవ్రమైన కడుపు నొప్పితో వస్తుందని ఎక్స్‌రే లేదా సీటీ స్కాన్‌లో కడుపులో గ్యాస్ కనిపించడం ద్వారా సులభంగా గుర్తించామన్నారు.అద్భుతమైన వైద్య పరిజ్ఞానం, శస్త్రచికిత్సా నైపుణ్యంతో, హైదరాబాద్ మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్య బృందం ఒక అరుదైన దాగి ఉన్న డ్యూడెనల్ పర్ఫొరేషన్ కేసును విజయవంతంగా గుర్తించి, 22 సంవత్సరాల యువ రోగి ప్రాణాలను కాపాడమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జనరల్ మేనేజర్ శ్రీనివాస్ చిదుర, వాసు కిరణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి పరివాహక ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యే



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలంలో గోదావరి పరివాహక ప్రాంతంలో వరద పరిస్థితిని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు పరిశీలించారు. రామాలయం టెంపుల్ వద్ద కరకట్ట, స్లూయిస్, కునవరం రోడ్డులో నూతన కరకట్ట పరిసరాలను భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్టతో కలిసి పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి గోదావరి వరద నీరు ఊర్లలోకి ప్రవేశించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, టీపీసీసీ నేతలు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

## రాజీవ్ గాంధీ మెమోరియల్" ట్రోఫీ విజేత శ్రీ చైతన్య పాఠశాల




ప్రజా స్ఫూర్తి ,భద్రాద్రి కొత్తగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రాజీవ్ గాంధీ మెమోరియల్ ట్రోఫీ- 2025 ని కొత్తగూడెం లోని శ్రీ చైతన్య స్కూల్ కైవసం చేసుకుంది. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం సమీపంలోని హేమచంద్రపురం భద్రాద్రి కొత్తగూడెం క్రికెట్ అకాడమీ మైదానంలో అండర్ 14 జట్లకు మధ్య జరిగిన రాజీవ్ గాంధీ మెమోరియల్ ట్రోఫీ టోర్నమెంట్ ఫైనల్స్ ఘనంగా ముగిసింది. ఈ ట్రోఫీ ప్రధానానికి ముఖ్యఅతిథిగా ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కొండపర్తి నరేష్ కుమార్ హాజరయ్యారు. ఫైనల్స్ మ్యాచ్లో శ్రీ శారద విద్యాలయ స్కూల్ జట్టుపై నిర్ణీత 20 ఓవర్లలో 103 పరుగుల లక్ష్యాన్ని శ్రీ చైతన్య స్కూల్ జట్టు చేదించి విజేతలుగా నిలిచారు. విన్నర్స్, రన్నర్స్ జట్లకు ముఖ్యఅతిథిగా హాజరైన ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్ బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడలపై బలమైన సంకల్పంతో మక్కువ పెంచుకుంటే భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా విద్యార్థులు రాణించగలరని అన్నారు. ఈ టోర్నమెంట్ లో ఫైనల్స్ వరకు చేరుకొని విన్నర్స్, రన్నర్స్ గా నిలిచిన జట్లను ఆయన అభినందించారు. ఈ టోర్నమెంట్ కన్వీనర్లుగా మతిన్ (ఖమ్మం), పంతంగి సాయి నిరంజన్ (భద్రాద్రి కొత్తగూడెం), ఆర్గనైజర్లుగా బోయిని ప్రసాద్, మార్గం నరేందర్, పదిరి నర్సిరెడ్డి వ్యవహరించారు. ఈ ఫైనల్ టోర్నమెంట్ ముగింపు వేడుకలు క్రీడాకారులు, తల్లిదండ్రులు, పాఠశాల పీఈటీలు, యాజమాన్యాలు పాల్గొన్నారు.

## జులైలో శ్రీవారి లడ్డూ విక్రయాల్లో రికార్డు!



తిరుపతి: తిరుమలలో ఈ ఏడాది జులై 12న రికార్డు స్థాయిలో 4,86,134 లడ్డూలు అమ్ముడుపోయాయి. గతేడాది ఇదే రోజు 3.24 లక్షలు విక్రయించగా అది 35 శాతం వరకు పెరగడం విశేషం. దీంతో ఆ ఒక్కరోజులోనే లడ్డూల విక్రయం ద్వారా రూ.2.43 కోట్లు సమకూరింది. గత ఏడాది జులై నెలలో లడ్డూల ఉత్పత్తి (చిన్నవి 160180 గ్రాములు) 1,04,57,550 ఉండగా ఈ ఏడాది జులైలో 1,25,10,300కు పెరిగింది. గత జులైలో 1,04,03,719 లడ్డూలు అమ్ముడుపోగా ఈ ఏడాది జులైలో 1,24,40,082 అమ్ముడుపోయాయి. దీంతోపాటు భక్తుల రద్దీ పెరిగినప్పుడు సరిపడా అవసరాల కోసం బఫర్ స్టాక్ కింద 4 లక్షలు పెట్టుకున్నారు.

# కాలనీలలోని సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తాం

* **మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మను చౌదరి**

మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : దమ్మాయిగూడ లోని అహ్మద్ గూడ 2 బిహెచ్ కె కాలనీలలోని సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తామని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మను చౌదరి స్థానికులకు తెలిపారు. గురువారం కీసర మండలంలోని దమ్మాయిగూడ లోని అహ్మద్ గూడ 2 బిహెచ్ కె కాలనీలలోని సమస్యలను జిల్లా కలెక్టరు ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ 41 బ్లాకులలో ఉన్న సమస్యలలో కొన్నింటిని ప్రత్యక్షంగా పరిశీలించాలని తప్పకుండా మీ సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తానని కలెక్టరు తెలిపారు. ఎలక్ట్రిసిటి ఫ్లక్యూవేషన్, ట్రాన్స్ ఫార్మర్లలకు కంచెతో భద్రత, కొన్ని ట్రాన్సఫర్మర్లను వేరే చోటికి మార్చడం వంటి సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని కలెక్టరు తెలిపారు. సెల్ ఫోన్ సిగ్నల్స్ కొరకు సెల్ టవర్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తామని సూచించారు.



వర్షం నీరు పోవడానికి పైప్ లైన్ల మరమ్మత్తులు, ఇళ్లలో గోడలు బీటలు వారి నీరు కారడం వంటి సమస్యలను పరిష్కరిస్తామని, అదే విధంగా లిఫ్ట్ మరమ్మత్తులు చేయించడమే కాకుండా సెల్లార్ లోని నీటి వల్ల ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లలు ఆడుకోవడానికి పార్కు, ఆట వస్తువులు సమకూర్చడమే కాకుండా పార్కు ప్రక్కనే ఉన్న సంపుకు ప్రహారీ ఏర్పాటు చేస్తామన్నారు. 9వ అంతస్తు పైన నీరు కారకుండా పైన మొత్తం చిప్పింగ్ వర్క్ చేయిస్తామని, స్కూలు, బస్తీ దవఖానా, అంగన్ వాడీ సెంటర్ ఏర్పాటు చేయడానికి పరిశీలిస్తామన్నారు. స్ట్రీట్ లైట్లు, బస్సు సౌకర్యం కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. మున్సిపాలిటి వారు ప్రతిరోజు వచ్చి చెత్త సేకరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంతే కాకుండా మీ పరిసరాలను మీరు శుభ్రంగా ఉంచుకుంటే పాములు, తేళ్లురావని స్థానికులకు సూచించారు. ప్రతి ఇంటిలోనికి నీరు వస్తుందని, డ్రైనేజీ వాటర్ పైకి వస్తున్నాయని స్థానికులు తెలుపగా, కలెక్టర్ స్పందిస్తూ ప్రతి సమస్యను తప్పకుండా పరిష్కరిస్తామని అన్నారు. ధార్మికత, ఆధ్యాత్మిక పెంపొందేలా మీరు కోరిన చోట మందిరం, మసీదు, చర్చి నిర్మించి ఇస్తామని కలెక్టరు సూచించారు. అంతే కాకుండా మీరురెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకొని ఎన్నికలు నిర్వహించి మీలో కొంత మందిని ఎన్నుకొని వారిద్వారా ప్రస్తుత సమస్యలు కాకుండా భవిష్యత్తులో ఎదురయే సమస్యలను పరిష్కరించు కోవాలని సూచించారు. ఇవే కాకుండా స్థానికులు కోరిన స్మశాన వాటిక, సెల్ టవర్, ఉపాధి వంటి సమస్యలను కూడా పరిష్కరిస్తానని కలెక్టరు వివరించారు. కలెక్టర్ అన్ని బ్లాకులు కలియ తిరిగి సమస్యలను పరిశీలించి స్పందించినందుకు స్థానికులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ పర్యటనలో జిల్లా హౌజింగ్ అధికారి రమణ మూర్తి, కీసర ఎంఆర్ఒ అశోక్, దమ్మాయిగూడ మున్సిపల్ కమీషనర్ వెంకట్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక వర్గం మొత్తాన్ని నిందించడం, బెదిరించడం తగదు



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి: అభివృద్ధి పథంలో శరవేగంగా దూసుకుపోతున్న భారతదేశాన్ని చూసి తట్టుకోలేక పోతున్న విదేశీ దుష్టుల సాయంతో దేశంలోని ద్రోహులు విభజన రాజకీయాలు చేస్తున్నారని హిందూ బంధువులు ఆరోపించారు. 'గో బ్యాక్ మార్వాడీ' అంటూ కొందరు పసలేని నినాదాలతో దేశ ప్రజల మధ్య చిచ్చురేపడానికి ప్రయత్నించడాన్ని మార్వాడీలతో కలిసి ఒక ప్రెస్ మీట్ లో ఖండించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 కల్పిస్తుందని, ఎవరో ఒకరిద్దరు చేసిన తప్పులకు ఒక సామాజిక వర్గం మొత్తాన్ని నిందించడం, బెదిరించడం తగదన్నారు. దేశంలో అందరికీ ఎక్కడైనా బతికే హక్కు, వ్యాపారం, ఉద్యోగం చేసుకొనే హక్కు ఉందన్నారు. మన రాష్ట్రం నుంచీ ఎంతో మంది వివిధ రాష్ట్రాల్లో, దేశాల్లో విద్య, ఉద్యోగం, వ్యాపారాల్లో ఉన్నారన్నారు. అక్కడి వాళ్లు ఇలాగే చేస్తే మన వాళ్ల పరిస్థితేమిటని ప్రశ్నించారు. ఇటువంటి విభజనవాద నినాదాలతో మిథ్యా ఇతివృత్తాలను వ్యాపింపజేస్తున్న ద్రోహుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు. మార్వాడీలతో కలిసి హిందువులు ఏర్పాటు చేసిన ఈ ప్రెస్ మీట్ లో డాక్టర్ ఎమ్ఆర్ఎస్ రాజు, రచ్చ చక్రధర్, మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు, దాసి నాగరాజు, బాబు చౌదరి, భవర్లాల్, శరవణ్ లాల్, మోహన్ లాల్, నిర్మల్, సూరజ్, బోలా రామ్, రాజారామ్, భరత్, షోలా రామ్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

* **మల్లాపురం పెద్ద చెరువు అలుగు పడడంతో గ్రామ ప్రజల పక్షాన గంగమ్మ తల్లికి పూజలు**



యాదగిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ సీఎం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది, మల్లాపురం పెద్ద చెరువు అలుగు పడడంతో గ్రామ ప్రజల పక్షాన మరియు గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఉప సర్పంచ్ పల్లెపాటి మాధవులు, బిఆర్ఎస్వి మండల అధ్యక్షుడు ఒగ్గు మల్లేష్, మాజీ వార్డ్ మెంబర్ కర్రె, చంద్రశేఖర్, బిఆర్ఎస్వి మండల ఉపాధ్యక్షులు మోటే శేఖర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం లో మిషన్ కాకతీయ లో భాగంగా గొలుసుకట్టు చెరువు లను కాళేశ్వరం నీళ్లు ద్వారా గత ఏడాది లో చెరువు నిండడం జరిగింది కొద్దిపాటి వర్షానికి ఈరోజు పూర్తిగా నిండడంతో మల్లాపురం గ్రామంలో ఉన్న కుంటలు సాయమ్మకుంట మల్యప్పకుంట లను కూడా ప్రస్తుత ప్రభుత్వం దృష్టి పెట్టి కాలువల ద్వారా నీళ్లు ఇవ్వాలని రైతులకు యూరియా సరైన సమయానికి అందించి రైతులను ఇబ్బందికి గురి చేయకుండా సరైన సమయానికి అందించాలని డిమాండ్ చేయడం చేశారు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పుచ్చుల నరసింహులు, పల్లెపాటి సత్యనారాయణ , పిట్టల ఆంజనేయులు, ఒగ్గు కృష్ణ , గౌడ కరుణాకర్, ఓరుగంటి శ్రీధర్, చల్లూరి సురేష్, ఒగ్గు శేఖర్, కర్రె మల్లేష్, రాజ్ కుమార్, ఒగ్గు శ్రీకాంత్ ,ఒగ్గు ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి పల్లె జాతర

**లక్ష పనులకు శంకుస్థాపనలు: మంత్రి సీతక్క**

హైదరాబాద్: రాష్ట్రంలో రెండోవిడత పల్లె జాతర కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభిస్తున్నామని..రూ.2,199 కోట్లతో 1,01,589 పనులను చేపట్టి, వచ్చే మార్చి నాటికి పూర్తి చేసేలా కార్యచరణ రూపొందించామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క తెలిపారు. పనుల జాతరలో ప్రజా ప్రతినిధులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. పనుల జాతర2025 గోడపత్రికను గురువారం ఆమె ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి సచివాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ''ఈ ఏడాది గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన, మౌలిక వసతుల విస్తరణ లక్ష్యంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, స్వచ్ఛ భారత్ మిషన్ పథకాల కింద పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా పనులను నిర్వహిస్తున్నాం.



## క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

* **బీజేపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ అన్నారు. గురువారం రామవరం సాధన గ్రౌండ్ లో అంబేద్కర్ ఐటీఐ కరస్పాండెంట్ వెలన్ కుమార్ తండ్రైన దొరై మెమోరియల్ రెడ్ బాల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలలో ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని, ప్రతీ పోటీల్లో గెలుపు ఓటములు సహజమని గెలుపొందిన వారు ఇంకా శ్రమిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని,ఓటమి చెందిన వారు మరింత సాధన చేసి భవిష్యత్ లో గెలుపొందుటకు కృషి చేయాలన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా సక్రమమైన మార్గంలో వెళ్తూ తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. ప్రస్తుత తరుణంలో క్రికెట్ పోటీలను నిర్వహించడం ఆషామాషీ విషయం కాదని పోటీలను నిర్వహిస్తున్న వారిని అభినందించారు.క్రికెట్ పోటీలు విజయవంతం కావాలని ఆకాక్షించారు కామేష్ కాసేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోతుకురి ధర్మారావు మాట్లాడుతూ కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత క్రీడలకు ఎక్కువ నిధులను కేటాయించడం జరుగుతుందని,భవిష్యత్తులో గ్రౌండ్ అభివృద్ధి కొరకు నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో వెలెన్ కుమార్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దేవీ ప్రసన్న, మోరె రమేష్, అప్పారావు, అశోక్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



## మేకల పెంపకం, మేకపాల ఉత్పత్తుల శిక్షణలో భద్రాద్రి కొత్తగూడెం అధికారులు

* **మథురలో ప్రత్యేక శిక్షణ – కొత్తగూడెంలో ఇప్పటికే మేకపాల విక్రయ కేంద్రం**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గిరిజనులు విస్తృతంగా నిర్వహిస్తున్న మేకల పెంపకాన్ని బలోపేతం చేయడానికి, అలాగే మేకపాలు, మేకపాలు ఉత్పత్తుల ప్రాసెసింగ్లో ఆధునిక పద్ధతులను నేర్చుకొని జిల్లాలో అమలు చేయుటకు, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచనలతో, జిల్లా నుండి ముగ్గురు పశువైద్యాధికారులు ఆగస్టు 18 నుండి 22 వరకు ఉత్తరప్రదేశ్ మథురలోని సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ గోట్స్ (సిఐఆర్జి ), మక్దూమ్లో ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు.

### శిక్షణలో ముఖ్యాంశాలు

ఈ శిక్షణలో అధికారులు కింది అంశాలలో అవగాహన పొందుతున్నారు.

మేకల పెంపకంలో ఆధునిక సాంకేతిక పద్ధతులు

అధిక పాల ఉత్పత్తి కోసం అనుసరించాల్సిన విధానాలు

మేకల జాతి మెరుగుదలకు కృత్రిమ గర్భధారణ సాంకేతికత

పశుగ్రాసాల వినియోగం, దాణా మిశ్రమాల తయారీ

మేకపాలు, మేకపాలు ఉత్పత్తుల ప్రాసెసింగ్ పద్ధతులు

### కలెక్టర్ అభిప్రాయం




జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ "భద్రాద్రి కొత్తగూడెం అడవి ప్రాంతం ఎక్కువగా ఉండడం వలన మేకల పెంపకానికి అత్యంత అనుకూల పరిస్థితులు ఉన్నాయి. దీని ద్వారా గిరిజనులు స్థిరమైన జీవనోపాధి సాధించడానికి మంచి అవకాశాలు లభిస్తాయి" అని పేర్కొన్నారు.అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆకాంక్షిత జిల్లా గా నీతి ఆయోగ్ ద్వారా గుర్తింపు పొందినందున, ఈ శిక్షణ గిరిజనుల ఆర్థికాభివృద్ధికి మరింత తోడ్పడుతుందని ఆయన అన్నారు.

ఇప్పటికే మేకపాల విక్రయ కేంద్రం

జిల్లాలో మేకపాలపై అవగాహన కల్పించేందుకు కొత్తగూడెం ఫుడ్ కోర్టులో మేకపాల విక్రయ కేంద్రం ఏర్పాటు చేసిన విషయం ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తు చేశారు.

## జై జవాన్ కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ ను స్వాధీనం చేసుకున్న జిహెచ్ఎంసి

* **12 ఏళ్ల పోరాటానికి దక్కిన ఫలితం : తాడూరి గగన్ కుమార్**




ప్రజాస్ఫూర్తి, కాప్రా : కాప్రా సర్కిల్ ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని జై జవాన్ కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ ను ఎట్టకేలకు జిహెచ్ఎంసి స్వాధీనం చేసుకుంది. గురువారం జిహెచ్ఎంసి డిప్యూటీ ఎస్టేట్స్ ఆఫీసర్ లావణ్య కాంప్లెక్స్ లోని 10 షట్టర్లకు తాళాలు వేసి స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ఇన్నాళ్లు కాలనీ సంక్షేమ సంఘం ఆధీనంలో ఉండేది. షాపింగ్ కాంప్లెక్స్ స్వాధీనం చేసుకోవడం పట్ల సమాచార హక్కు సాధన సమితి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కన్వీనర్ తాడూరి గగన్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. పన్నెండు సంవత్సరాల పోరాటానికి ఫలితం దక్కిందన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ ను స్వాధీనం చేసుకోవాలని గత 12 సంవత్సరాలుగా అనేక సార్లు విజ్ఞప్తులు, ఫిర్యాదులు చేయడం జరిగిందన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రారంభించిన ప్రజావాణి ద్వారా సమస్య పరిష్కారమైందన్నారు. ఇందుకు సహకరించిన జిహెచ్ఎంసి ఎస్టేట్ విభాగం అధికారులతో పాటు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిహెచ్ఎంసి స్వాధీనం చేసుకున్న కమర్షియల్ కాంప్లెక్స్ లోని షట్టర్లను ఓపెన్ టెండర్ల ద్వారా నిరుద్యోగ యువకులకు కేటాయించాలని ఆయన కోరారు. గత 12 సంవత్సరాలుగా అద్దె రూపంలో వసూలు చేసుకున్న రూ. కోటి రూపాయలను ప్రభుత్వం రికవరీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయమై అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని ఆయన అన్నారు.

## బైకుల సంత

కూరగాయల సంత.. పశువులు, మేకల సంతలు అన్నిచోట్లా జరుగుతుంటాయి. ఆరేళ్లుగా కామారెడ్డిలో ప్రతి గురువారం బైకుల సంతనూ నిర్వహిస్తున్నారు. ఇక్కడి సీఎస్ఐ చర్చి మైదానంలో నిర్వహిస్తున్న ఈ బైకుల అంగడికి వివిధ ప్రాంతాల నుంచి విక్రయదారులు.. తమ ద్విచక్ర వాహనాలను తీసుకువస్తారు. నిర్వాహకుడు.. వాటి పేపర్లు అన్నీ సక్రమంగా ఉందీ లేనిదీ తనిఖీ చేశాకే విక్రయానికి పెడతారు. ఇందుకోసం ఫీజుగా రూ.50 తీసుకుంటారు. ఔత్సాహికులు ఇష్టమైన వాహనాన్ని, ధర నచ్చితే కొనుగోలు చేస్తారు. ఇలా బైకు క్రయవిక్రయాలు నిర్వహించినందుకు నిర్వాహకుడు కొంత కమీషన్ తీసుకుంటారు. జిల్లావ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల నుంచి బైక్‌ల కొనుగోలుదారులు వస్తుంటారు. ప్రతివారం ఈ అంగడిలో 50 బైక్‌ల వరకు విక్రయాలు జరుగుతుంటాయి.

## ఫసల్ బీమా అమలుపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం

* **'పల్లె పల్లెకు భాజపా'లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు**

చేవెళ్ల: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులను ఆదుకునేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే 'పల్లె పల్లెకు భాజపా' కార్యక్రమాన్ని గురువారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం చన్‌వెళ్లిలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రైతు సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన రుణమాఫీ, రైతు భరోసా సాయం తదితర హామీలను సంపూర్ణంగా అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. కేంద్రం కిసాన్ సమ్మాన్ నిధి కింద అర్హులైన రైతులందరికీ రూ.6 వేల పెట్టుబడి సాయం అందిస్తోందని గుర్తుచేశారు. వరితో పాటు వాణిజ్య పంటలు, పప్పు దినుసులు, నూనె గింజల పంటలకు కేంద్రం కనీస మద్దతు ధర కల్పిస్తోందని, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు రైతులకు రాయితీలు ఇస్తోందని తెలిపారు. చన్‌వెళ్లి రైతులు కేంద్రం ఇస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని 100 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో పాలీహౌస్‌లు ఏర్పాటు చేసుకుని పూలతోటల సాగుతో ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందించారు.

# జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటారా?: హైకోర్టు

* **కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్లపై విచారణ రేపటికి వాయిదా**



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను రద్దు చేయాలని కోరుతూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను హైకోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. కేసీఆర్ తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది ఆర్యామ సుందరం వాదనలు వినిపించారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నిబంధనలు పాటించలేదని కోర్టుకు వివరించారు. నోటీసులు సరైన విధానంలో ఇవ్వలేదన్నారు. అంతేకాకుండా నివేదికను కేసీఆర్, హరీశ్‌రావుకు ఇవ్వలేదని చెప్పారు. కమిషన్ సమర్పించిన నివేదికను ప్రభుత్వం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిందని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. రాజకీయంగా భారత రాష్ట్ర సమితికి, కేసీఆర్‌కు నష్టం చేకూర్చేలా నివేదిక రూపొందించారని ఆరోపించారు. ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. విలేకరుల సమావేశంలో సీఎం కమిషన్ నివేదిక వివరాలను తెలిపారని అన్నారు. వెబ్‌సైట్‌లోనూ అప్‌లోడ్ చేశారని, కేసీఆర్‌కు మాత్రం నివేదిక కాపీలు ఇవ్వలేదని, దీనిపై ప్రభుత్వానికి లేఖ రాసినా స్పందన లేదని కేసీఆర్ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తెచ్చారు. కమిషన్ నివేదికపై ప్రభుత్వం త్రిసభ్య కమిటీ ఏర్పాటుచేసిందని ప్రభుత్వం తరఫు న్యాయవాది తెలిపారు. అసెంబ్లీలో చర్చించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తున్నట్లు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి న్యాయస్థానానికి వివరించారు. ఇద్దరు పిటిషనర్లు అసెంబ్లీలో సభ్యులుగా ఉన్నారని తెలిపారు. అలాంటప్పుడు నివేదికను ఎందుకు బయటపెట్టారని ఏజీని హైకోర్టు ప్రశ్నించింది. మీడియా సమావేశంలో ప్రతి విలేకరికి 60 పేజీల నివేదిక ఇచ్చారని కోర్టుకు తెలిపారు. కోర్టుకు సమర్పించిన నివేదిక కాపీలు సరిగ్గా కనిపించడం లేదని సీజే అన్నారు. ప్రాధాన్యం దృష్ట్యా విచారణ ఇవాళే కొనసాగించాలని కేసీఆర్ తరఫు న్యాయవాది కోర్టును అభ్యర్థించారు. కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటారా? అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చ తర్వాత చర్యలు తీసుకుంటారా? అని హైకోర్టు ధర్మాసనం.. ఏజీని ప్రశ్నించింది. ప్రభుత్వ నిర్ణయం చెప్పడానికి సమయం కావాలని ఏజీ సుదర్శన్‌రెడ్డి కోరారు. దీంతో విచారణను హైకోర్టు రేపటికి వాయిదా వేసింది.

## పీపీపీ ద్వారా వాహనాలు సమకూరిస్తే మరింత మెరుగ్గా సేవలు అందిస్తాం: సీవీ ఆనంద్



హైదరాబాద్: ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్ని వాహనాలు ఇచ్చినా పోలీస్‌శాఖకు సరిపోవని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ అన్నారు. అందుకే పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) ద్వారా వాహనాలను కేటాయిస్తే ఇంకా మెరుగ్గా సర్వీసులు అందించగలుగుతామన్నారు. హైదరాబాద్‌లో 650 జంక్షన్లు ఉన్నాయని.. రోజు రోజుకూ వాహనాల రద్దీ పెరుగుతోందని చెప్పారు. నగరంలో సగటువేగం 18కి.మీ నుంచి 23కి.మీకి పెరిగిందన్నారు. దేశంలోనే తొలిసారిగా ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్‌లో నియమించామన్నారు. ‘‘ట్రాఫిక్ మార్షల్స్ సంబంధిత పోలీస్ స్టేషన్ సీఐ, ఎస్సైల పర్యవేక్షణలో పని చేస్తారు. చాలా ఆలోచించిన తర్వాతే ట్రాఫిక్ సిబ్బందికి డ్రెస్‌లు ఇచ్చాం. రాబోయే రోజుల్లో 500 మంది వరకు ట్రాఫిక్ మార్షల్స్ పెరుగుతారని అనుకుంటున్నాం. వీళ్లంతా చాలా బాధ్యతగా వ్యవహరించాలి. ట్రాఫిక్ విభాగానికి, పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలి. ట్రాఫిక్ పెట్రోలింగ్ బైక్‌లకు డాష్‌బోర్డు కెమెరాలు ఏర్పాటు చేశాం. బైక్ నడుపుతున్న వారికి బాడీవేర్ కెమెరా ఉంటుంది.’’ అని సీపీ వివరించారు.

## ఎరువులు సరఫరా చేయాల్సిన బాధ్యత కేంద్రానిదే: పొన్నం



కరీంనగర్: తెలంగాణ రైతులకు అవసరమైన ఎరువులు సరఫరా చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ‘‘రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా పట్టించుకోవడం లేదు. కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నారు. రైతులకు జవాబు చెప్పాల్సిన బాధ్యత బండి సంజయ్‌పై ఉంది. ఎరువుల విషయంలో రైతుల్లో భయాందోళనలు సృష్టించి భారత రాష్ట్ర సమతి నేతలు రాక్షసానందం పొందుతున్నారు. రైతులకు అవసరమైన ఎరువుల్లో 60 శాతం మాత్రమే కేంద్రం నుంచి వచ్చింది. అందువల్లే కొంత ఇబ్బంది కలుగుతోంది. రాష్ట్రం నుంచి ఏదైనా సమస్య వస్తే బాధ్యత వహించడానికి మేం సిద్ధంగా ఉన్నాం’’ అని పొన్నం ప్రభాకర్ అన్నారు.

## రాచకొండ సీపీ ఎదుట లొంగిపోయిన సెంట్రల్ కమిటీ మావోయిస్టు సభ్యులు



హైదరాబాద్: రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఎదుట ఇద్దరు సెంట్రల్ కమిటీ మావోయిస్టు సభ్యులు లొంగిపోయారు. మావోయిస్టు సీనియర్ స్టేట్ కమిటీ సభ్యురాలు కాకరాల సునీత సీపీ ఎదుట లొంగిపోయారు. ఆమె తండ్రి, ఒక విప్లవ రచయితల సంఘం నాయకుడిగా పని చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలును సీపీ వెల్లడించారు. ‘‘వరవరరావు, గద్దర్ లాంటి విప్లవకారులు వారి ఇంటికి వస్తుండటంతో సునీత మావోయిస్టుల సిద్ధాంతాల వైపు మొగ్గు చూపారు. ఆమె 1986లో పీపుల్స్ వార్ పార్టీలో ఉన్నారు. 1986 ఆగస్టులో టీఎల్ఎన్ చలం గౌతమ్ అలియాస్ సుధాకర్‌ను వివాహం చేసుకున్నారు. విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో సెంట్రల్ ఆర్గనైజర్‌గా పనిచేశారు. 1992లో నల్లమల అడవుల్లోకి వెళ్లారు. 2001లో ఏవోబీ ప్రాంతానికి, 2006లో దండకారణ్యానికి బదిలీ అయ్యారు. చెన్నూరి హరీశ్ అలియాస్ రమణ కూడా నేడు లొంగిపోయారు. ఆయన పదో తరగతి చదువుతున్నప్పుడు ఏటూరునాగారం బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో మావోయిస్టు సిద్ధాంతానికి ఆకర్షితులయ్యారు. 2024లో ఏసీఎంగా పనిచేశారు. వీరిద్దరూ ఎన్నో ఎన్‌కౌంటర్లలో పాల్గొన్నారు. జనజీవన స్రవంతిలో పాల్గొనడం మంచి పరిణామం’’ అని సీపీ తెలిపారు.

## పర్యాటక శాఖతో కలిసి జంపన్నవాగు అభివృద్ధి: మంత్రి సీతక్క



హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మేడారం జాతరకు వసతులు కల్పిస్తున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. పర్యాటకశాఖతో కలిసి జంపన్న వాగును అభివృద్ధి చేస్తామన్నారు. స్మృతి వనాన్ని 29 ఎకరాల్లో ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ‘‘ఆదివాసీ పూజారులతో కలిసి స్మృతివనాన్ని అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారు. నిధులు మంజూరు చేసినందుకు సీఎం, డిప్యూటీ సీఎంకు ప్రత్యేకంగా ధన్యవాదాలు. తెలుగు ప్రజల గొప్ప జాతర సమ్మక్క సారలమ్మ జాతర. ప్రజలు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరు చేసింది.’’ అని సీతక్క తెలిపారు.

## యూరియాను కనీసం చూడని నేతలూ విమర్శిస్తున్నారు

**: మంత్రి తుమ్మల**



హైదరాబాద్: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, యూరియా సరఫరాపై సమీక్షించారు. గోదావరి వరదలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులను ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. భద్రాచలం వద్ద గోదావరి మూడో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకుంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ‘‘రాష్ట్రానికి ఆగస్టు వాటా యూరియా ఇవ్వాలి. అత్యవసరాన్ని గుర్తించి త్వరగా ఇవ్వాలి. యూరియాను కనీసం చూడని నేతలు కూడా విమర్శలు చేస్తున్నారు. పెద్దపెద్ద మాటలు మాట్లాడి అభాసుపాలు కావద్దు. నన్ను విమర్శించే వారు కేంద్రమంత్రి నడ్డాను అడగవచ్చు. యూరియా సరఫరాపై అన్ని లెక్కలు ఇస్తున్నాను. రామచందర్‌రావు అంటే నాకు గౌరవం. అబద్ధాలు చెప్పి భాజపాను బాగు చేయాలంటే సాధ్యం కాదు. రైతులపై రాజకీయాలు చేసి పార్టీని పెంచుకోలేరు. వాస్తవాలను రామచందర్‌రావు ఒప్పుకోవాలి. యూరియాపై ఎప్పటికప్పుడు లెక్కలు కేంద్రానికి పంపుతున్నాం. నిన్నగాక మొన్న వచ్చిన రామచందర్‌రావు విమర్శలు సరికావు. శవాలపై పేలాలు ఏరుకునేలా భాజపా వ్యవహారం ఉంది. యూరియాపై భాజపా అసత్య ప్రచారం మానుకోవాలి. రామచందర్‌రావుకు పలుకుబడి ఉంటే యూరియా తెప్పించాలి. ఆయనకు అంత పలుకుబడి ఉందని నేను అనుకోను. దేశవ్యాప్తంగా యూరియా సమస్య ఉంది. యూరియాను దాచుకొని మేం ఏం చేసుకుంటాం? పదేపదే విమర్శలు సరికాదు. బాధ్యత గల పదవిలో ఉన్నప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలి. యూరియాపై కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డితో వ్యక్తిగతంగా మాట్లాడా. కేంద్రాన్ని ఒప్పించి రామచందర్‌రావు.. యూరియా తెప్పించాలి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున చేయాల్సిందంతా చేస్తున్నాం. కేంద్రం కూడా సహకరించాలి.’’ అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

## ఇంజినీరింగ్ కాలేజీల్లో ఫీజుల పెంపుపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం



హైదరాబాద్: ఇంజినీరింగ్, వృత్తి విద్యా కాలేజీల్లో ఫీజుల పెంపుపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కళాశాలలు అందించే అకౌంట్స్‌తో పాటు ఆయా కళాశాల్లో విద్యా ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని మాత్రమే ఫీజులు నిర్ధరించాలని నిర్ణయించింది. ఈమేరకు ఫీజుల పెంపునకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇంజినీరింగ్, వృత్తి విద్యా కళాశాలల్లో విద్యార్థుల హాజరు, ఫేషియల్ రికగ్నేషన్ అమలు, ఆధార్ ఆధారిత ఫీజుల చెల్లింపులు సహా విద్యార్థులను పరిశోధనల వైపు ప్రోత్సహిస్తున్నారా అనే అంశాలను సైతం పరిగణనలోకి తీసుకోనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. కాలేజీలు నాణ్యమైన విద్య అందిస్తున్నాయా? ఆ కాలేజీల్లో విద్యార్థులకు ప్లేస్ మెంట్స్ ఎలా ఉన్నాయి అనే అంశాలపైనా దృష్టి సారించనుంది. జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగ్‌లు, ప్రభుత్వ నిబంధనలను ఏ మేరకు అమలు చేస్తున్నారనే అంశాలను సైతం పరిశీలించిన తర్వాతే కళాశాలల్లో ఫీజులను నిర్ధరించనున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

## మూసీ సుందరీకరణ పేరుతో భారీ దోపిడీకి తెరలేపారు: కేటీఆర్



హైదరాబాద్: మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సొమ్మును దోచుకోవడానికి సిద్ధమవుతోందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. నాడు కేసీఆర్ ప్రభుత్వం మూసీ అభివృద్ధి కోసం అన్ని ఏర్పాట్లు చేసి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తే.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అంచనాలను భారీగా పెంచి దోపిడీకి తెరలేపిందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా గోదావరి నీటిని హైదరాబాద్‌కు దగ్గరలోని కొండపోచమ్మ సాగర్‌కు గత ప్రభుత్వం తీసుకొచ్చిందన్న ఆయన.. అక్కడి నుంచి గండిపేట చెరువుకు తరలించడానికి 2022లోనే రూ.1,100 కోట్లతో ఆమోదం తెలిపినట్లు గుర్తు చేశారు. మూసీలోకి చేరే 2000 ఎంఎల్డీ మురుగునీటి శుద్ధి కోసం 36 ఎస్టీపీల నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. నాగోల్ ప్రాంతంలో ఐదు కిలోమీటర్ల మేర సుందరీకరణ పనులు పూర్తి చేయడంతో పాటు ఉప్పల్ భగాయత్‌లో శిల్పారామాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. మూసీ అభివృద్ధి కోసం అన్నీ సిద్ధం చేసి రూ.16,000 కోట్లతో మాస్టర్ ప్లాన్, డీపీఆర్ తయారు చేస్తే... కాంగ్రెస్ ప్రభుత్వం అంచనాలను రూ.1.50 లక్షల కోట్లకు పెంచి దోపిడీకి పాల్పడుతోందని కేటీఆర్ ఆరోపించారు. ప్రజాధనం దోపిడీని కచ్చితంగా అడ్డుకుంటామన్నారు.

## 81 ఏళ్ల వృద్ధుడిపై హనీట్రాప్.. లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు



హైదరాబాద్: సైబర్ నేరగాళ్ల పంజాకు హైదరాబాద్‌కు చెందిన ఓ వృద్ధుడు చిక్కాడు. అతడి నుంచి రూ. 7.11 లక్షలను కేటుగాళ్లు కాజేశారు. నగరంలోని అమీర్‌పేట్‌కు చెందిన 81 ఏళ్ల వృద్ధుడిని సైబర్ నేరగాళ్లు మోసగించారు. ఆయనతో చనువుగా మాట్లాడుతూ సొమ్మును తస్కరించారు. ఇంకా డబ్బులు అడగటంతో అనుమానం వచ్చిన వృద్ధుడు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఐటీబీపీ జవాన్ల ధైర్య సాహసాలను మరువలేం.. కేంద్ర మంత్రి బండి సంజయ్



ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ జవాన్ల ధైర్య సాహసాలు మరువలేమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. అరుణాచల్ ప్రదేశ్ సీఎం పెమాఖండూ ఆహ్వానం ఇటానగర్‌కు వెళ్లిన బండి సంజయ్ ఆయనతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ముందుగా ఆయన ఫెమా ఖండూకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పపుంపుర జిల్లాలోని యుపియా గ్రామంలో ఉన్న ఐటీబీపీ 31వ బెటాలియన్ హెడ్‌క్వార్టర్స్‌ను సందర్శించారు. తొలుత అమరవీరుల ఘాట్ వద్ద పూలమాల వేసి వీరమరణం పొందిన జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐటీబీపీ సిబ్బంది కేంద్ర మంత్రికి గౌరవ వందనం సమర్పించారు. ఆ వెంటనే 31వ బెటాలియన్ ఐటీబీపీకి సంబంధించి కొత్తగా నిర్మించిన ఏఎస్ఐ మెస్ (భవనం45), Animal Training School వద్ద లోహిత్‌పూర్‌లో అధికారులు, సబ్ఆర్డినేట్ అధికారుల నివాస సముదాయం, పరిపాలనా భవనం, అధికారుల మెస్, 10 పడకల ఆసుపత్రి బసార్‌లో 49వ బెటాలియన్ ఏఎస్ఐ మెస్, నివాస సముదాయాలను కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుకునే జవాన్లకు గౌరవ మర్యాదలతో పాటు సౌకర్యాలతో జీవించేలా చేసేందుకు కేంద్రం కృషిచేస్తుందని అన్నారు. దేశ భద్రతకు ఆత్మ అయిన ఐటీబీపీ ధైర్యవంతులైన హిమవీరుల మధ్య నిలబడటం గర్వంగా ఉందని అన్నారు.

## భారతదేశంలో తొలిసారి 5 స్టార్ విద్యుత్‌దాచే

# గాలి కూలర్లను 5 సంవత్సరాల వారంటీతో పరిచయం చేసిన కెన్స్టార్

*** '-ఫైవ్ పవర్' సిరీస్‌తో కూలింగ్‌లో కొత్త ప్రమాణాలు**

హైదరాబాద్, ఆగస్టు 21, 2025 - దాదాపు మూడు దశాబ్దాలుగా వినియోగదారుల విశ్వాసాన్ని అందుకుంటూ వస్తున్న కెన్స్టార్, భారతదేశపు తొలి బీఈఈ 5స్టార్ రేటెడ్ విద్యుత్‌దాచే గాలి కూలర్ల ప్రత్యేక శ్రేణిని ఆవిష్కరించింది. 5 సంవత్సరాల వారంటీతో అందుబాటులోకి వచ్చిన ఈ సిరీస్, సుస్థిరత, శక్తి సామర్థ్యం, అత్యుత్తమ శీతలీకరణ పనితీరుతో ప్రత్యేకతను సంతరించుకుంది. 'ఫైవ్ పవర్' కూలర్లలో బీఎల్డీసీ మ్యాక్స్ సాంకేతికత, క్వాడ్రా ఫ్లో సాంకేతికత ద్వారా శక్తివంతమైన గాలి ప్రవాహం, హైడ్రో డెన్స్ మెష్ హనీకాంబ్ ప్యాడ్లు, భారీ మోటార్ వంటి ఆధునిక సాంకేతికతలు వినియోగించబడ్డాయి. ఇవి విద్యుత్ వినియోగాన్ని తగ్గించడమే కాకుండా, అధిక శీతలీకరణ పనితీరును అందిస్తాయి. కెన్స్టార్ సిఇఓ




సునీల్ జైన్ మాట్లాడుతూ, "ఈ కొత్త 5స్టార్ కూలర్ల శ్రేణి మా సుస్థిరత పట్ల ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తోంది. పర్యావరణానుకూల ఉత్పత్తులు, అత్యుత్తమ నాణ్యత, వినియోగదారుల విశ్వాసం మా ప్రధాన లక్ష్యాలు" అన్నారు. జాతీయ విక్రయాధికారి సంతోష్ భామ్రే మాట్లాడుతూ, "భారతదేశంలోనే తొలి 5స్టార్ రేటెడ్ కూలర్లను పరిచయం చేయడం గౌరవంగా భావిస్తున్నాం. సాంకేతిక ఆవిష్కరణ, శక్తి సామర్థ్యం, నాణ్యతపై రాజీ పడకుండా పోటీ ధరలకు అందించడం మా లక్ష్యం" అన్నారు. 29 ఏళ్ల విశ్వసనీయతతో కెన్స్టార్ గృహోపకరణ రంగంలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేస్తూ, వినియోగదారుల మారుతున్న అవసరాలను తీర్చే దిశగా అడుగులు వేస్తోంది. కొత్త ఫైవ్ పవర్ గాలి కూలర్లు శైలి, కార్యాచరణ, ఆవిష్కరణలను సమ్మిళితం చేస్తూ శీతలీకరణ పరిష్కారాల్లో కొత్త ప్రమాణాన్ని స్థాపించనున్నాయి.

## బైక్ ట్యాక్సీ లగ్జరీ కాదు.. అవసరం: కర్ణాటక హైకోర్టు



రాష్ట్ర ప్రభుత్వం బైక్ ట్యాక్సీలపై నిషేధం విధించడాన్ని కర్ణాటక హైకోర్టు తప్పుబట్టింది. బైక్ ట్యాక్సీ లగ్జరీ కాదని.. నగర ప్రజలకు అది అవసరమని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి విభు బఖ్రు నేతృత్వంలోని బెంచ్ పేర్కొంది. మధ్యతరగతి ప్రజలకు బైక్‌ట్యాక్సీలు ఎంతో ఉపయోగకరమైనవని.. దేశంలోని దాదాపు 13 రాష్ట్రాల్లో ఈ సౌకర్యం అందుబాటులో ఉందని వ్యాఖ్యానించింది. మోటారు వాహనాల చట్టం బైక్ ట్యాక్సీలను నిషేధిస్తుందనే రాష్ట్ర ప్రభుత్వ వాదనను తోసిపుచ్చింది. బైక్ ట్యాక్సీలపై నిషేధం విధించడం వల్ల వాటిపైనే ఆధారపడిన ఎన్నో కుటుంబాలు రోడ్డునపడతాయని.. ప్రజల జీవనోపాధి హక్కును పూర్తిగా హరించే అధికారం ఎవరికీ ఉండదని ఆగ్రహం వ్యక్తంచేసింది. బైక్ ట్యాక్సీలను మినహాయించడానికి రాష్ట్రం ఉద్దేశపూర్వకంగా విధాన వైఖరిని తీసుకుందా అని కోర్టు ప్రశ్నించింది. బైక్ ట్యాక్సీ డ్రైవర్లపై ప్రస్తుతానికి ఎటువంటి బలవంతపు లేదా శిక్షాత్మక చర్యలు తీసుకోకుండా చూసుకోవాలని అడ్వకేట్ జనరల్‌ను న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 22కి వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల్లో తన నిర్ణయాన్ని తెలియజేయాలని సూచించింది. కర్ణాటక హైకోర్టు వ్యాఖ్యలను తాము స్వాగతిస్తున్నట్లు 'బైక్స్ ట్యాక్సీ వెల్ఫేర్ అసోసియేషన్' ప్రకటించింది. చట్టబద్ధమైన, సురక్షిత కార్యకలాపాలను కొనసాగించడానికి తాము ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొంది.

## భావజాల శత్రువు భాజపా.. రాజకీయ విరోధి డీఎంకే: నటుడు విజయ్

తమ భావజాల శత్రువు భాజపా.. రాజకీయ విరోధి డీఎంకే అని టీవీకే అధ్యక్షుడు, నటుడు విజయ్ పేర్కొన్నారు. వచ్చే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు, తమ పార్టీకి మధ్యే ప్రధాన పోటీ ఉంటుందన్నారు. రాష్ట్రంలో ప్రతి ఇంటి తలుపును తడతామన్నారు. అసెంబ్లీ ఎన్నికల సన్నాహాలను ఉద్ధృతం చేసిన ఆయన.. మదురైలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఈమేరకు ప్రసంగించారు. తనను ఎంత విమర్శిస్తే అంత ఎదుగుతానని వ్యాఖ్యానించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విప్లవం సృష్టిస్తామన్నారు. తాను మధురై ఈస్ట్ నుంచి పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. ''కులం కాదు..



మతం కాదు.. తమిళుడికే ప్రాధాన్యం ఇస్తాం. భాజపాతో చేతులు కలిపే ప్రసక్తే లేదు. మనుగడ కోసమే ఇతర పార్టీలు పొత్తు పెట్టుకుంటున్నాయి. ఆరెస్సెస్ ముందు మనం ఎందుకు తలవంచాలి? తమిళ అస్తిత్వాన్ని ప్రతిపక్షాలు తగ్గిస్తున్నాయి. కచ్చతీవులకు శ్రీలంక నుంచి స్వేచ్ఛ కల్పిస్తాం. రాష్ట్ర సీఎం ఎంకే స్టాలిన్ దిల్లీలో రహస్య సమావేశాలు జరుపుతున్నారు. ఆయన పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది'' అని విజయ్ విమర్శలు గుప్పించారు. 2024 ఫిబ్రవరిలో టీవీకేను స్థాపించినప్పటినుంచి భారీ సభను నిర్వహించడం ఇది రెండోసారి. గతేడాది విల్లుపురం జిల్లాలోని విక్రవందిలో తొలి సభ నిర్వహించారు.

## జియోటస్ పర్పెచువల్ ఫ్యూచర్స్ లాంచ్..

*** సెప్టెంబర్ 30 వరకు జీరో ట్రాన్సాక్షన్ ఛార్జీలు**

కేవలం రూ.100 నుంచే క్రిప్టో ఫ్యూచర్స్ ట్రేడింగ్

హైదరాబాద్, ఆగస్టు 21, 2025: దేశంలోని ప్రముఖ క్రిప్టో ఎక్స్ఛేంజ్ జియోటస్, ట్రేడర్ల కోసం పర్పెచువల్ ఫ్యూచర్స్ ను అధికారికంగా లాంచ్ చేసింది. 12 లక్షలకుపైగా ఇన్వెస్టర్లకు ఈ కొత్త సదుపాయం అందుబాటులోకి వస్తుందని కంపెనీ తెలిపింది. ప్రారంభ ఆఫర్‌లో భాగంగా సెప్టెంబర్ 30, 2025 వరకు ట్రాన్సాక్షన్లు ఉచితంగా ఉంటాయని ప్రకటించింది. కేవలం రూ.100 కనీస పెట్టుబడితో క్రిప్టో ఫ్యూచర్స్ ట్రేడింగ్ ప్రారంభించే అవకాశం కల్పించిన జియోటస్, రియల్ టైమ్ లైవ్ మార్కెట్ అప్‌డేట్స్ మరియు సురక్షితమైన బ్యాకెండ్ ఇన్‌ఫ్రా తో ఈ ఉత్పత్తిని అందిస్తోంది. పర్పెచువల్ ఫ్యూచర్స్ ప్రత్యేకత ఏమిటంటే ఎలాంటి ఎక్స్‌పైరీ డేట్ లేకుండా ఇన్వెస్టర్లు కావలసినంతకాలం వాటిని హోల్డ్ చేసుకోవచ్చు. జియోటస్ సీఈఓ విక్రమ్ సుబ్బురాజ్ మాట్లాడుతూ, "భారత క్రిప్టో ఇన్వెస్టర్ల అవసరాలకు అనుగుణంగా నూతన ఉత్పత్తులను అందిస్తున్నాం. ఫ్యూచర్స్ ట్రేడింగ్ వలన మార్కెట్‌లోని ఒడిదుడుకులను ఎదుర్కోవచ్చు. అదనంగా, జియోటస్ ప్లాట్‌ఫారమ్ ప్రభుత్వ నియమాలకు పూర్తిగా అనుగుణంగా, సురక్షితంగా పనిచేస్తోంది" అని అన్నారు. 2017లో స్థాపించబడిన జియోటస్, ప్రస్తుతం స్పాట్, ఎస్ఐపీ, స్టేకింగ్, ఫ్యూచర్స్ వంటి విభిన్న ఉత్పత్తులను అందిస్తోంది. సురక్షితమైన క్రిప్టో ఎకోసిస్టమ్ నిర్మాణంలో జియోటస్ కీలకపాత్ర పోషిస్తూ, దేశవ్యాప్తంగా లక్షలాది ఇన్వెస్టర్లకు విశ్వసనీయమైన ఎంపికగా మారింది.

## కేరళ పాఠశాల బయట ప్రమాదకర పేలుడు పదార్థాలు లభ్యం



కేరళలోని ఓ పాఠశాల బయట ప్రమాదకరమైన పేలుడు పదార్థాలు కలకలం రేపాయి. వాటిల్లో ఒకదాన్ని ఓ విద్యార్థి విసిరేయడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. పాలక్కాడ్ జిల్లా వడకంధరలోని ఓ పాఠశాల బయట బుధవారం సాయంత్రం ప్రమాదకరమైన పేలుడు పదార్థాలు కన్పించాయి. నారాయన్ (10) అనే విద్యార్థి ఆడుకుంటూ బయటకు వచ్చి.. పేలుడు పదార్థాలను చూశాడు. వాటిల్లో ఒకదాన్ని విసిరేయగా.. పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో విద్యార్థితో పాటు మరో వృద్ధురాలికి స్వల్ప గాయాలయ్యాయి. పాఠశాలలోని సిబ్బంది, స్థానికులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలోనే వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకొని తనిఖీలు నిర్వహించగా.. మరో నాలుగు పేలుడు పదార్థాలను కనుగొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇవి చాలా ప్రమాదకరమైనవని, కావాలనే వాటిని ఎవరో అక్కడ ఉంచారని పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. పేలుడు పదార్థాలు అక్కడ ఎవరు ఉంచారనే విషయం తెలుసుకునేందుకు సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై భాజపా జిల్లా నాయకులు స్పందిస్తూ.. దీనివెనక పెద్ద కుట్ర ఉందని ఆరోపించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. కాగా.. పాఠశాల యాజమాన్యానికి, ఆర్ఎస్ఎస్‌తో సంబంధం ఉందని, ఆ ప్రాంతంలోని వాలంటీర్లకు శిక్షణ కూడా ఇస్తుందని సీపీఐ(ఎం) నాయకులు ఆరోపించారు. ఈ పేలుడు పదార్థాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని కాంగ్రెస్ నాయకులు కూడా కోరారు.

## 'ఓట్ల చోరీ'తో ఫలితాలు తారుమారు: రాహుల్ గాంధీ ఆరోపణ

గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలను భాజపా తారుమారు చేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. 'ఓట్ల చోరీ'ని రాజ్యాంగంపై దాడిగా పేర్కొన్నారు. ఎన్నికల సంఘంతో కాషాయ పార్టీ కుమ్మక్కై ఓట్ల అవకతవకలకు పాల్పడేందుకు అనుమతించబోమని తెలిపారు. 'ఓటర్ అధికార్ యాత్ర'లో భాగంగా బిహార్‌లోని ముంగేర్‌లో నిర్వహించిన సభలో ఈ మేరకు ఆరోపణలు గుప్పించారు. ''ఎన్నికల సంఘం ద్వారా ఓటరు జాబితాల 'ప్రత్యేక సమగ్ర సవరణ' పేరిట ఓట్ల చోరీకి కాషాయ పార్టీ యత్నిస్తోంది. అయితే.. భాజపా, ఈసీ కలిసి బిహార్ ప్రజల ఓటు హక్కును లాక్కునేందుకు 'ఇండియా'



కూటమి అనుమతించదు. గత లోక్‌సభ ఎన్నికల ఫలితాలనూ ఆ పార్టీ తారుమారు చేసింది. కొందరు పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం చేకూర్చేందుకు యత్నిస్తోంది'' అని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం చోరీ చేసిన ఓట్ల ద్వారానే ఏర్పాటైనట్లు అంతకుముందు రాహుల్ గాంధీ ఆరోపించారు. అటువంటి ప్రభుత్వానికి ప్రజాసేవ చేసే ఉద్దేశం ఉంటుందా? అని ప్రశ్నించారు. బిహార్‌లోని ఔరంగాబాద్ జిల్లా యువతతో సమావేశమైన వీడియోను 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేస్తూ.. దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు ప్రజలు తమ ఓటు శక్తిని వినియోగించాలని పిలుపునిచ్చారు. సరైన ఓటరు జాబితాలే స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలకు పునాదిగా పేర్కొన్నారు.




### జపాన్‌లో 'భారతీయం'..

## చీరకట్టుతో అరిటాకుల్లో వడ్డన!

విదేశాల్లో అనేక రెస్టరంట్లలో భారతీయ వంటకాలు లభిస్తుంటాయి. కానీ, అక్కడ భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు అక్కడ ప్రతిబింబించడం మాత్రం అత్యంత అరుదు. ఒకవేళ భారతీయులే స్వయంగా నిర్వహిస్తే తప్ప అలాంటి దృశ్యాలు మనకు కానరావు. కానీ, జపాన్‌లో ఓ జంట నిర్వహిస్తున్న రెస్టరంట్ భారతీయతకు నిలువెత్తు దర్పణంలా నిలుస్తోంది. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా నిర్వాహకులు చీరకట్టుతో అందరికీ అరిటాకుల్లో వడ్డించి తమ ప్రత్యేకతను చాటుతున్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ రెస్టరంట్‌లోకి వెళ్లిన వారికి భారతీయ సంప్రదాయంలో నమస్కరించి ఆహ్వానిస్తారు. అలా లోపలికి వెళ్లగానే రాధాకృష్ణుల విగ్రహాలు, వీణ, మట్టి పాత్రలు దర్శనమిస్తాయి. చీరకట్టులో ఉన్న వ్యక్తులు అరటి ఆకులో కస్టమర్లకు భోజనాన్ని వడ్డిస్తుండడం ఇక్కడి ప్రత్యేక ఆకర్షణ. బెంగాలీతో పాటు దక్షిణాది వంటకాలనూ ఇక్కడ వడిస్తుండటం విశేషం. 'ఇండియన్ స్పైసీ ఫ్యాక్టరీ' పేరుతో జపాన్‌కు చెందిన దంపతులు నకాయమాసాన్, సచికోసాన్ ఈ రెస్టరంట్‌ను నిర్వహిస్తున్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై తమకున్న అభిమానం, ఇష్టంతో ఈ రెస్టరంట్‌ను నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు. గతంలో కోల్‌కతా, దిల్లీలో రెస్టరంట్ నిర్వహించిన అనుభవం కూడా తమకు ఉందని పేర్కొన్నారు. భారతీయ రుచుల్ని జపనీయులకు సైతం అందించగలుగుతున్నందుకు తమకెంతో ఆనందంగా ఉందంటోన్న ఈ దంపతులను నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

## సరిహద్దుపై నేపాల్ అభ్యంతరం.. ఖండించిన భారత్



భారత్ చైనాల మధ్య వివాదాలు పరిష్కరించుకునే దిశగా ఇరుదేశాలు అడుగులు వేస్తున్నాయి. ఈక్రమంలో లిపులేఖ్ ప్రాంతం మీదుగా వాణిజ్య సరిహద్దులను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించుకున్నాయి. దీనిపై నేపాల్ అభ్యంతరం తెలిపింది. కాగా, భారత విదేశాంగ శాఖ దీనిపై స్పందిస్తూ ఈవిషయంలో నేపాల్ వాదనలు అసమగ్రంగా ఉన్నాయని స్పష్టంచేసింది. మహాకాళి నదికి తూర్పున ఉన్న లింపియాధుర, లిపులేఖ్, కాలాపాణిలు తమ దేశంలో భాగమని నేపాల్ విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి లోక్ బహదూర్ ఛెత్రి పేర్కొన్నారు. తమ మ్యాప్‌లోను ఇదే స్పష్టమవుతుందని వాదించారు. ఇప్పటికే ఈవిషయాన్ని చైనా ప్రభుత్వానికి కూడా తెలియజేశామన్నారు. భారత్ నేపాల్‌ల మధ్య ఉన్న సరిహద్దు సమస్యను దౌత్యపరమైన చర్చలతో పరిష్కరించుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. నేపాల్ వాదనలపై భారత విదేశాంగ శాఖ ప్రతినిధి జైశ్వాల్ తీవ్రంగా స్పందించారు. 'లిపులేఖ్ ద్వారా భారత్ చైనాల మధ్య సరిహద్దు వాణిజ్యం తిరిగి ప్రారంభించడంపై నేపాల్ అభ్యంతరం చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈవిషయంలో మా వైఖరి స్థిరంగా, చాలా స్పష్టంగా ఉంది. లిపులేఖ్ ద్వారా మా వాణిజ్యం 1954లో ప్రారంభమై.. కొన్ని దశాబ్దాల పాటు సాగింది. ఆ తర్వాత పలు కారణాల వల్ల ఇటీవల దానికి అంతరాయం కలిగింది. ఇప్పుడు తిరిగి దాన్ని ప్రారంభించాలని ఇరుదేశాలు నిర్ణయించుకున్నాయి' అని పేర్కొన్నారు. నేపాల్ ప్రాదేశిక వాదనలను సమర్థించలేమన్నారు. దాని వాదనలపై ఎలాంటి చరిత్రాత్మక ఆధారాలు లేవన్నారు. కృత్రిమంగా చేపట్టిన సరిహద్దు మార్పులను తాము అంగీకరించబోమని ఉద్ఘాటించారు. ఈ సమస్యను దౌత్యపరమైన చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని స్పష్టంచేశారు. వివాదాల పరిష్కారం కోసం చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ భారత్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈసందర్భంగా ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌లతో భేటీ అయ్యారు. ఇరుదేశాల మధ్య నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్చలు జరిపారు. అనంతరం లిపులేఖ్, షిప్కి లా, నాథు లా మార్గాల ద్వారా వాణిజ్యాన్ని తిరిగి ప్రారంభించాలని, ఇందుకు ఇరుదేశాలు అంగీకరించాయంటూ ఓ ఉమ్మడి ప్రకటనను విడుదల చేశారు. లిపులేఖ్, కాలాపానీ, లింపుయాదురా ప్రాంతాలను తమ భూభాగాలుగా పేర్కొంటూ నేపాల్ 2020లో సరికొత్త మ్యాప్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. నాటి కేపీ శర్మ వోలీ ప్రభుత్వం దీనిపై తీర్మానం చేయడంతో పాటు.. పార్లమెంటులో ఆమోదముద్ర కూడా వేసింది. అయితే భారత్ దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ.. నేపాల్ వాటిని బేఖాతరు చేసింది.

# 82 వేలకు సెన్సెక్స్..

## వరుసగా నాలుగో రోజూ లాభాలే..



**ముంబై:** భారత ఆర్థిక వ్యవస్థ బలంగా, స్థిరంగా ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా చేసిన ప్రకటన మదుపర్లలో ఆత్మవిశ్వాసం నింపింది. దీంతో వరుసగా నాలుగో రోజు కూడా దేశీయ సూచీలు లాభాల బాటలోనే పయనించాయి. ఉదయం లాభాలతో ప్రారంభమైన సూచీలు రోజంతా లాభాల్లోనే పయనించాయి.

భారత ఆర్థిక వ్యవస్థ బలంగా, స్థిరంగా ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా చేసిన ప్రకటన మదుపర్లలో ఆత్మవిశ్వాసం నింపింది. దీంతో వరుసగా నాలుగో రోజు కూడా దేశీయ సూచీలు లాభాల బాటలోనే పయనించాయి. ఉదయం లాభాలతో ప్రారంభమైన సూచీలు రోజంతా లాభాల్లోనే పయనించాయి. అంతర్జాతీయంగా సానుకూలాంశాలు కూడా కలిసి రావడంతో సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా నాలుగో రోజు కూడా లాభాలను ఆర్జించాయి.

బుధవారం ముగింపు (81, 857)తో పోల్చుకుంటే గురువారం ఉదయం 350 పాయింట్లకు పైగా లాభంతో మొదలైన సెన్సెక్స్ రోజంతా నష్టాల్లోనే కదలాడింది. గురువారం సెన్సెక్స్ 81, 921-82,231 మధ్యలో శ్రేణి కదలాడింది. చివరకు సెన్సెక్స్ 142 పాయింట్ల లాభంతో 80, 000 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 33 పాయింట్ల లాభంతో 25, 083 వద్ద స్థిరపడింది.

సెన్సెక్స్‌లో పీజీ ఎలక్ట్రోప్లాస్ట్, మ్యాన్‌కైండ్ ఫార్మా, సిప్లా, ఏబీ క్యాపిటల్, టిటాగర్ షేర్లు లాభాలను ఆర్జించాయి. బీఎస్ఈ లిమిటెడ్, ఏంజెల్ వన్, ఎమ్‌సీఎక్స్ ఇండియా, డాబర్ ఇండియా, వోడాఫోన్ ఐడియా షేర్లు నష్టాల బాటలో నడిచాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 221 పాయింట్లు కోల్పోయింది. బ్యాంక్ నిఫ్టీ 56 పాయింట్లు ఆర్జించింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 87.27గా ఉంది.

# బెంగళూరులో యాపిల్ తొలి రిటైల్ స్టోర్ ఓపెనింగ్‌కి ముహూర్తం ఖరారు..



**బెంగళూరు:** దిగ్గజ టెక్ కంపెనీ యాపిల్ భారత్‌లో తన కార్యకలాపాలు మరింతగా విస్తరిస్తోంది. ఐ-ఫోన్లు, ఇతర ఉత్పత్తులకు భారత్ బెస్ట్ మార్కెట్‌గా నిలిచిన నేపథ్యంలో ఇండియాలో తయారీ, విక్రయ కార్యకలాపాల్ని వేగంగా విస్తరిస్తోంది. ఇక ఢిల్లీ, ముంబైలో రిటైల్ స్టోర్లను తెరిచిన సంస్థ.. ఇప్పుడు మూడో స్టోర్‌ను బెంగళూరు లో ఓపెన్ చేసేందుకు సిద్ధమైంది. ఇందుకోసం ముహూర్తం కూడా ఖరారు చేసింది. వచ్చే నెల అంటే సెప్టెంబర్ 2వ తేదీన బెంగళూరులో తొలి రిటైల్ స్టోర్‌ను ప్రారంభించనున్నట్లు యాపిల్ తాజాగా ప్రకటించింది. ఈ స్టోర్ బెంగళూరులోని ఫీనిక్స్ మాల్‌లో ఉంది.

### యాపిల్ కళ్లు చెదిరే డీల్..

భారత్‌లో తయారీ, విక్రయ కార్యకలాపాల్ని వేగంగా విస్తరిస్తోన్న యాపిల్ సంస్థ.. బెంగళూరులో భారీ ఆఫీస్ స్పేస్‌ను లీజుకు తీసుకున్నట్లు ఇటీవలే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. రియల్ ఎస్టేట్ అనలిటిక్స్ సంస్థ ప్రాప్‌స్టాక్ ప్రకారం.. బెంగళూరు లో ఎంబసీ జెనిత్ భవనంలో 2.7 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని అద్దెకు తీసుకుంది. ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్ ఎంబసీ గ్రూప్‌కు చెందిన కమర్షియల్ ప్రాజెక్టు ఎంబసీ జెనిత్‌లోని ఆ కార్యాలయ స్థలం కోసం 10 ఏళ్ల కాలానికి యాపిల్ సంస్థ డీల్ కుదుర్చుకుంది.

9 అంతస్తుల్లో (5 నుంచి 13వ అంతస్తు వరకు) విస్తరించి ఉన్న ఈ ఆఫీస్ స్పేస్ కోసం యాపిల్ సంస్థ నెలకు రూ.6.3 కోట్ల అద్దె చెల్లించనుంది. ఏడాదికి 4.5 శాతం చొప్పున అద్దె పెంపుతో పార్కింగ్, మెయింటెనెన్స్ చార్జీలతో కలిపిమొత్తం ఈ పదేళ్లలో సంస్థ రూ.1,000 కోట్లను అద్దెగా చెల్లించేందుకు ఒప్పందం చేసుకుంది. 2025 ఏప్రిల్ 3 నుంచి ఈ లీజు అమల్లోకి వచ్చింది. ఈ లీజు ఒప్పందంలో భాగంగా యాపిల్ రూ.31.57 కోట్లు డిపాజిట్ కూడా చేసింది. కాగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో మన దేశం నుంచి అతి పెద్ద మొబైల్ ఫోన్ల ఎగుమతిదారుగా యాపిల్ నిలిచిన విషయం తెలిసిందే. సుమారు రూ.1.5 లక్షల కోట్ల విలువైన ఫోన్లను ఎగుమతి చేసింది.

# ఈపీఎఫ్‌వో చరిత్రలో సరికొత్త ఘనత..

## జూన్‌లో అదిరే రికార్డ్ నమోదు..




**న్యూఢిల్లీ:** దేశంలో ఉద్యోగాల కల్పన రికార్డు స్థాయిలో పెరిగింది. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ విడుదల చేసిన తాజా డేటా ప్రకారం.. జూన్ నెలలో 2.18 మిలియన్ల ఉద్యోగులు కొత్తగా యాడ్ అయ్యారు. ఇది ఏప్రిల్ 2018లో పే-రోల్ డేటా ట్రాకింగ్ ప్రారంభమైనప్పటి నుండి నమోదైన అత్యధిక సంఖ్య అని కార్మిక -ఉపాధి మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇది మే 2025లో నమోదైన 2.01 మిలియన్ల ఉద్యోగుల కంటే 8.9శాతం ఎక్కువ. గత ఏడాది జూన్ 2024తో పోలిస్తే ఈ ఏడాది జూన్‌లో ఉద్యోగుల చేరిక 12.9 శాతం పెరిగింది. జూన్ 2025లో దాదాపు 1.06 మిలియన్ల కొత్త ఉద్యోగులు పీఎఫ్‌లో నమోదు చేసుకున్నారు. ఇది మే నెలతో పోలిస్తే 12.6శాతం అధికం. ఈ పెరుగుదలకు ఉద్యోగ అవకాశాలు, ఉద్యోగుల ప్రయోజనాలపై అవగాహన పెరగడం, ఈపీఎఫ్‌వో కార్యక్రమాలు కారణమని మంత్రిత్వ శాఖ తెలిపింది.

### యువత, మహిళలకు మెరుగైన అవకాశాలు

యువతలో వృద్ధి: జూన్‌లో చేరిన కొత్త సభ్యులలో 60.2శాతం మంది (0.64 మిలియన్లు) 18-25 సంవత్సరాల వయస్సు గలవారు. ఇది మే నెలతో పోలిస్తే 14.1శాతం అధికం. వ్యవస్థీకృత శ్రామిక శక్తిలోకి ప్రవేశిస్తున్న చాలామంది యువత, ముఖ్యంగా మొదటిసారి ఉద్యోగార్థులు ఉన్నారని ఇది సూచిస్తుంది.

**మహిళా సభ్యులు:** జూన్ నెలలో 4.7 లక్షల మంది మహిళా సభ్యులు, 3.0 లక్షల మంది కొత్త మహిళా సభ్యులు ఈపీఎఫ్‌వోలో చేరారు. ఇది జూన్ 2024తో పోలిస్తే 10.3శాతం, కొత్త సభ్యుల చేరిక 1.34శాతం పెరిగినట్లు సూచిస్తుంది. మహిళా సభ్యుల చేరికలో పెరుగుదల మరింత కలుపుకొని, వైవిధ్యభరితమైన శ్రామిక శక్తి వైపు మార్పును సూచిస్తుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

# ఆసియా కప్‌లో ఆడేందుకు భారత జట్టుకు గ్రీన్ సిగ్నల్..!

## మల్టీ నేషనల్ టోర్నీలు అడ్డుకోబోమన్న క్రీడల మంత్రిత్వశాఖ వర్గాలు..!



**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ జట్టు వచ్చే నెలలో ఆసియా కప్‌లో పాల్గొననున్నది. ఈ మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో మ్యాచ్ ఆడనున్నది. పాక్‌తో మ్యాచ్‌ను టీమిండియా ఆడుతుందా? లేదా? అన్న అనుమానాలున్నాయి. అయితే, తాజాగా బిగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. భారత జట్టును ఆసియా కప్‌లో పాల్గొనకుండా కేంద్ర ప్రభుత్వం ఆపదంటూ క్రీడల మంత్రిత్వశాఖ వర్గాలను ఉటంకిస్తూ పీటీఐ కథనం పేర్కొంది. ఇప్పటికే భారత్, పాకిస్తాన్ మధ్య ద్వైపాక్షిక మ్యాచ్‌లు జరుగడం లేదని, ఆసియా కప్ వంటి టోర్నమెంట్లలో జట్లు ఆడకుండా ఆపలేమని క్రీడా మంత్రిత్వశాఖ వర్గాలు పేర్కొన్నట్లుగా నివేదిక తెలిపింది. ఆసియా కప్ సెప్టెంబర్ 9న మొదలు కానున్నది. సెప్టెంబర్ 14న పాకిస్తాన్‌తో మ్యాచ్ ఆడనున్నది. పాక్‌తో మ్యాచ్‌పై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. పహల్గాం ఉగ్రదాడిని గుర్తు చేస్తూ అమాయక పర్యాటకుల ప్రాణాలు తీశారని.. ఉగ్రవాదులకు మద్దతు ఇచ్చే దేశంతో క్రికెట్ ఏంటని పలువురు మండిపడుతున్నారు. ఆసియా కప్‌ను బహిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.




భారత్-పాకిస్తాన్ మధ్య ఇప్పటికే ద్వైపాక్షిక మ్యాచ్‌లు జరుగడం లేదని.. మల్టీ నేషనల్ టోర్నీల్లో ఆడకుండా ఆపలేమని క్రీడా మంత్రిత్వ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. అంతర్జాతీయ కార్యకలాపాలకు సంబంధించి పాకిస్తాన్‌తో ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ ఓ విధానం అమలు చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు స్పష్టం చేశాయి. పాకిస్తాన్‌తో పాల్గొనే క్రీడా కార్యకమాలపై భారతదేశ విధానం.. ఆ దేశంతో వ్యవహరించే మొత్తం విధానాన్ని ప్రతిబింబిస్తుందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. 'ఒక దేశంలోని ద్వైపాక్షిక క్రీడా కార్యక్రమాల విషయానికి వస్తే.. భారత జట్లు పాకిస్తాన్‌లో జరిగే పోటీల్లో పాల్గొనవు.. పాకిస్తాన్ జట్లను భారత్‌లో ఆడేందుకు అనుమతించమని.. అయితే, మల్టీ నేషనల్ టోర్నీలు మాత్రం ప్రభావితం కావు. ఆసియా కప్ మల్టీ నేషనల్ టోర్నీ కాబట్టి భారత క్రికెట్ జట్టును మేం అడ్డుకోం. కానీ, పాకిస్తాన్ భారత గడ్డపై ద్వైపాక్షిక మ్యాచులు ఆడటానికి అనుమతించం. కానీ, ఒలింపిక్ చార్టర్‌కు కట్టుబడి ఉన్నందున మల్టీ నేషనల్ టోర్నమెంట్‌లలో ఆడకుండా వారిని ఆపం' అని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

ఆసియా కప్ ఈ ఏడాది టీ20 ఫార్మాట్‌లో జరుగనున్నది. ఈ టోర్నీకి యూఏఈ వేదికగా జరుగనున్నది. భారత్, పాకిస్తాన్ ఒకే గ్రూపులో ఉన్న విషయం తెలిసిందే. వాస్తవానికి ఈ టోర్నీకి భారత్ ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది. టోర్నీ బీసీసీఐ నిర్వహించనుండగా.. యూఏసీ వేదికగా నిర్వహించనున్నారు. ఆఫ్ఘనిస్తాన్, హాంకాంగ్, యూఏఈ, బంగ్లాదేశ్, శ్రీలంక, ఒమన్ జట్లు కూడా ఈ టోర్నమెంట్‌లో ఆడుతున్నాయి.

అయితే, ఉగ్రవాదం, ఆపరేషన్ సిందూర్ సంఘటనల నేపథ్యంలో మ్యాచ్‌పై పలు పార్టీల నేతలతో పాటు పలువురు అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆసియా కప్‌ను బాయ్‌కాట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇటీవల భారత క్రికెటర్లు వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ లో పాకిస్తాన్‌తో ఆడటానికి నిరాకరించిన విషయం తెలిసిందే. హర్భజన్ సింగ్, కేదార్ జాదవ్ వంటి చాలా మంది మాజీ క్రికెటర్లు ఆసియా కప్‌లో పాకిస్తాన్‌తో ఆడవద్దని విజ్ఞప్తి చేశారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత రెండు చిరకాల ప్రత్యర్థులు పోటీపడడం ఇదే మొదటిసారి. ఆసియా కప్‌లో భారత్-పాకిస్తాన్ జట్లు మూడుసార్లు పోటీపడే అవకాశం ఉంది. గ్రూప్ దశ తర్వాత, రెండు జట్లు సూపర్ ఫోర్ దశలో, ఫైనల్‌లో కూడా తలపడే అవకాశాలు ఉన్నాయి. ఆసియా కప్ సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు జరగనుంది. భారత జట్టు సెప్టెంబర్ 10న యుఏఈతో జరిగే ఆసియా కప్‌లో తన తొలి మ్యాచ్‌ను ఆడుతుంది. సెప్టెంబర్ 14న పాకిస్తాన్‌తో ఆడుతుంది, గ్రూప్ దశలో తన చివరి మ్యాచ్ సెప్టెంబర్ 19న ఒమన్‌తో జరుగుతుంది.

# ముంబయి జట్టుకు షాక్..

## కెప్టెన్సీకి అజింక్య రహానే గుడ్ బై..!

**ముంబై:** సుదీర్ఘమైన దేశవాళీ క్రికెట్ సీజన్ ప్రారంభానికి ముందు ముంబయి క్రికెట్ జట్టుతో పాటు అభిమానులకు షాక్ తగిలింది. సీనియర్ బ్యాట్స్‌మెన్ అజింక్య రహానే కెప్టెన్సీకి రాజీనామా చేశాడు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశారు. జట్టు కొత్త నాయకత్వాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ఇదే సమయం మంచి సమయమని పేర్కొన్నాడు. ముంబయి జట్టుకు నాయకత్వం వహించడం, టోర్నమెంట్ గెలువడం తనకు చాలా గౌరవమని పేర్కొన్నాడు. ఇప్పుడు కొత్త దేశవాళి సీజన్ ప్రారంభం కానుందని.. కొత్త బాధ్యతల కోసం.. కొత్త కెప్టెన్సీని సిద్ధం చేయడం అవసరమని తాను భావిస్తున్నానని.. ఈ మేరకు కెప్టెన్సీ నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. తాను బ్యాట్స్‌మెన్‌గా పూర్తిగా కట్టుబడి ఉంటానని.. తాజా ట్రోఫీని గెలిచే లక్ష్యంతో ముంబయి తరపున ఆడటాన్ని కొనసాగిస్తానని పేర్కొన్నారు.

రహానే కెప్టెన్సీలో ముంబయి దేశీయ క్రికెట్‌లో స్థిరత్వం సాధించడంతో పాటు విజేతగా నిలిచింది. రహానే నాయకత్వంలో ముంబయి 2023-24 సీజన్‌లో రంజీ ట్రోఫీని గెలిచింది. 2024-25లో ఇరానీ కప్, 2022-23లో సయ్యద్ ముష్తాక్ అలీ ట్రోఫీలోనూ జట్టును విజయపథంలో నడిపించాడు. ఈ విజయాలు రహానే కెప్టెన్సీని కొత్త శిఖరాలకు తీసుకెళ్లాయి. 201 ఫస్ట్-క్లాస్ మ్యాచుల్లో 14వేల కంటే ఎక్కువ పరుగులు చేసిన రహానే.. కెప్టెన్సీని వదులుకున్నా



తాను మాత్రం రిటైర్డ్ కావడం లేదని స్పష్టం చేశాడు. అన్ని ఫార్మాట్లలో బ్యాట్స్‌మన్‌గా ఆడుతూనే ఉంటానని చెప్పుకొచ్చారు. బ్యాట్స్‌మన్ పాత్రలో పూర్తి ఉత్సాహంతో, నిబద్ధతతో ఆడుతానని రహానే చెప్పాడు.

ముంబయి జట్టులో ఇప్పుడు సూర్యకుమార్ యాదవ్, శ్రేయాస్ అయ్యర్, యశస్వి జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్ వంటి ఆటగాళ్లు ఉన్నారు. వీరందరికీ నాయతక్వ లక్షణాలు ఉన్నాయి. రహానే నిర్ణయంతో రాబోయే కాలంలో జట్టుకు కొత్తగా దిశా నిర్దేశం చేస్తుందని భావిస్తున్నారు. కొత్తగా కెప్టెన్సీ రేసులో శ్రేయాస్ అయ్యర్ ముందున్నాడు. రహానే చివరిసారిగా ఐపీఎల్‌లో కోల్‌కతా తరపున బరిలోకి దిగాడు. ఈ టోర్నీలో 13 మ్యాచ్‌ల్లో 390 పరుగులు చేశాడు. ముంబయి కెప్టెన్సీ నుంచి తప్పుకోవాలనే నిర్ణయంతో.. రాబోయే సీజన్‌లో కేకేఆర్ అతన్ని కెప్టెన్‌గా కొనసాగిస్తుందా? లేదా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది అక్టోబర్ 15 నుంచి కొత్త రంజీ సీజన్ మొదలు కానున్నది. ముంబయి జట్టు తన తొలి మ్యాచ్‌ను జమ్మూ కశ్మీర్‌తో ఆడనున్నది.

# బీసీసీఐ కీలక నిర్ణయం..!

## చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం పొడిగింపు..!

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ నియంత్రణ మండలి కీలక నిర్ణయం తీసుకున్నది. టీమిండియా చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలాన్ని పొడిగించినట్లు సమాచారం. ఆయన పదవీకాలాన్ని 2026 జూన్ వరకు పొడిగించినట్లుగా పలు నివేదికలు తెలిపాయి. అయితే, అగార్కర్ నేతృత్వంలో భారత్ జట్టు వరుసగా 2024 టీ20 ప్రపంచకప్, 2025 చాంపియన్స్ ట్రోఫీ వంటి ప్రతిష్టాత్మక టైటిల్స్‌ను సాధించింది. దాంతో సెలక్షన్ కమిటీపై బీసీసీఐ పూర్తి విశ్వాసం వ్యక్తం చేస్తూ.. అజిత్ అగార్కర్ కాంట్రాక్ట్‌ను పొడిగించినట్లుగా పలు నివేదికలు తెలిపాయి. 'అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ, జట్టులో విజయవంతమైన మార్పులు తీసుకురావడంలో సఫలమైంది. అగార్కర్ తన పదవీకాలంలో భారత జట్టును ఒక్కటి కాదు.. రెండు ప్రతిష్ఠాత్మక టైటిళ్లను గెలిపించడమే కాకుండా, టెస్టులు, టీ20 జట్లలో మార్పులను ప్రవేశపెట్టాడు' అని ఓ బీసీసీఐ అధికారి పేర్కొన్నారు. దాంతో ఈ నిర్ణయం, అగార్కర్ తన కాంట్రాక్ట్ పొడిగింపును కొన్ని నెలల క్రితమే అంగీకరించడంతో మరింత స్పష్టమైంది.

ప్రస్తుత సెలక్షన్ ప్యానెల్‌లో ఎస్ఎస్ దాస్, సుబ్రతో బెనర్జీ, అజయ్ రాత్రా, ఎస్ శరత్ సభ్యులుగా ఉన్నారు. సెప్టెంబర్‌లో జరిగే బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశంలో కమిటీలో



మార్పులను చేసే అవకాశం ఉందని సమాచారం. శరత్ స్థానాన్ని భర్తీ చేసే అవకాశం ఉందని.. దాస్, బెనర్జీ స్థానాల విషయంలో సమీక్షించనున్నట్లు తెలుస్తున్నది. సమావేశం తర్వాత బోర్డు సెలక్షన్ కమిటీ సభ్యుల నియామకం కోసం దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలుస్తున్నది. సీనియర్ మహిళా, జూనియర్ పురుషుల సెలక్షన్ కమిటీల్లోనూ మార్పులు చేయనున్నట్లు తెలుస్తున్నది. నీతు డేవిడ్, ఆరతి వైద్య, మిథు ముఖర్జీలతో కూడిన మహిళా ప్యానెల్ ఐదేళ్ల పదవీకాలం పూర్తయ్యింది. బీసీసీఐ నిబంధనల ప్రకారం. ఐదేళ్లు గరిష్ట పదవీకాలం. రాబోయే వారాల్లో కొత్త సభ్యుల కోసం దరఖాస్తులను ఆహ్వానించనున్నది.

# మమ్మల్ని గెలిపించండి..

## 'చిన్నస్వామి'కి పూర్వవైభవం తీసుకొస్తాం..!

**బెంగళూరు:** చిన్నస్వామి మైదానంలో బంతి పడి రెండు నెలలు దాటింది. తొక్కిసలాట తర్వాత న్యాయ విచారణ.. పోలీసులు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ నిరాకరించడం వంటి కారణాలతో ఈ మైదానంలో క్రికెట్ మ్యాచ్‌ల సందడే కనిపించడం లేదు. త్వరలోనే మహిళల వన్డే వరల్డ్ ఉన్నందున ఎన్‌వోసీ కోసం కర్నాటక క్రికెట్ సంఘం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తుంది. ఈ నేపథ్యంలో భారత మాజీ పేసర్ వెంకటేశ్ ప్రసాద్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశడు. తొక్కిసలాట ఘటనతో అప్రతిష్టపాలైన చిన్నస్వామి స్టేడియానికి పూర్వ వైభం తీసుకొస్తానని అన్నాడు.

ప్రస్తుతం కర్నాటక క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న రఘురామ్ భట్ నేతృత్వంలోని సభ్యుల పదవీకాలం సెప్టెంబర్ 30న ముగియనుంది. దాంతో, కొత్త టీమ్ కోసం వచ్చే అక్టోబర్-నవంబర్‌లో ఎన్నికలు జరుగనున్నాయి. తొక్కిసలాటతో క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణకు అడ్డంకులు ఎదుర్కొంటోంది కేసీఏ. యాజమాన్యం నిర్లక్ష్యంతోనే చిన్నస్వామి స్టేడియం చిక్కుల్లో పడిందంటున్న వెంకటేశ్ ప్రసాద్ తాము పగ్గాలు చేపడితే సుపరిపాలన అందిస్తుందని హామీ ఇస్తున్నారు.

టీమిండియా తొలితరం పేసర్లలో ఒకడైన ఆయన చిన్నస్వామి ఇమేజ్ పెంచుతానని మాట ఇస్తున్నాడు. గతంలో (2013-16) నాలుగేళ్ల పాటు ఉపాధ్యక్షుడిగా పనిచేసిన ఆయన ఈసారి కేసీఏ చీఫ్‌గా సుపరిపాలన, పారదర్శకత అందించాలని భావిస్తున్నాడు. 'చిన్నస్వామి స్టేడియం క్రికెట్ మ్యాచ్‌లకు ఒక





అద్భుతమైన చోటు. దాదాపు 50 ఏళ్లుగా ఈ మైదానంలో ఎన్నో రసవత్తర పోరాటాలు జరిగాయి. అలాంటి వేదిక ఇప్పుడు బోసిపోయింది. మ్యాచ్‌ల నిర్వహణకు పోలీసుల అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి ఇన్నేళ్లలో ఒక్కసారి రాలేదు. ఆఖరికి సొంతగడ్డపై జరగాల్సిన మహారాజా టీ20 లీగ్ కూడా ఇతర వేదికలకు తరలిపోయింది. అందుకే.. మేము మళ్లీ ఇక్కడ అంతర్జాతీయ మ్యాచ్‌లు జరిగేలా కృషి చేస్తాం. మాపై విశ్వాసం ఉంచండి.

ఏకసభ్యకమిషన్ లేవనెత్తిన ఇంజనీరింగ్ లోపాలను సరిదిద్దడంపై దృష్టి సారిస్తాం. నేను ఇదివరకూ చెప్పినట్టు ఈ స్టేడియాన్ని 1974లో నిర్మించారు. ప్రస్తుతం 34 వేల నుంచి 35 వేల మంది ప్రేక్షకులకు మాత్రమే సీటింగ్ సామర్థ్యం ఉంది. మేము గెలిస్తే.. సీట్ల సంఖ్య పెంచుతాం. మరో 15 వేల వరకూ అంటే.. 50 వేల మంది మ్యాచ్‌ను వీక్షించేలా ఏర్పాట్లు చేస్తాం' అని వెంకటేశ్ తెలిపాడు.

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విక్టరీ పరేడ్ సందర్భంగా జూన్ 4న జరిగిన తొక్కిసలాటలో పదకొండు మంది మరణించారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం నిర్వాహకుల అజాగ్రత్తే తొక్కిసలాటకు కారణమైందని మండిపడింది. ఏకసభ్య కమిషన్ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తూ.. చిన్నస్వామి స్టేడియం డిజైన్‌లో, నిర్మాణంలో లోపం ఉందని చెప్పింది. పెద్ద మ్యాచ్‌ల నిర్వహణకు ఈ స్టేడియం ఏమాత్రం పనికిరాదని కర్నాటక క్రికెట్ సంఘానికి షాకిచ్చిన విషయం తెలిసిందే.




# దర్శకత్వంలోకి నేహాశర్మ

టాకీస్: చిరుత సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది నేహా శర్మ. ఈ సినిమా తర్వాత నేహా శర్మ పలు తెలుగు, హిందీ సినిమాల్లో నటించినా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఇంప్రెస్ చేయలేకపోయాయి. అయితే నేహా శర్మ సినిమాలతో బ్రేక్ అందుకోలేకపోయినా ఏ మాత్రం నిరాశ చెందకుండా సోషల్ మీడియా ద్వారా అభిమానులతో టచ్‌లో ఉంటూ అందరిలో జోష్ నింపుతోంది. కాగా ఈ భామకు సంబంధించిన ఆసక్తికర వార్త ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఈ బ్యూటీ- ఇక డైరెక్టర్‌గా తన లక్‌ను పరీక్షించుకు నేందుకు రెడీ అవుతుంది. బాలీవుడ్ స్టార్ యాక్టర్ అజయ్ దేవ్‌గన్ నిర్మించనున్న పీరియాడిక్ క్రియేచర్ డ్రామాకు నేహాశర్మ దర్శకత్వం వహించనుందన్న వార్త ఇప్పుడు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగ్రా మారింది. ఓ లీడింగ్ ఓటీ-టీ- ప్లాట్‌ఫాం భాగస్వామ్యంతో 1945 బ్యాక్ డ్రాప్‌లో సాగే కథ నేపథ్యంలో రాబోయే సినిమాను నేహాశర్మ డైరెక్ట్ చేయనుందంటూ బీటౌన్‌లో కథనాలు రౌండప్ చేస్తున్నాయి.మరి అజయ్ దేవ్‌గన్ టీ-ం ఎలాంటి కథను రెడీ చేసిందనేది ప్రస్తుతానికి సస్పెన్స్‌లో ఉండగా.. గ్లామర్ డాళ్ నేహా శర్మ దర్శకత్వం వహిస్తుందన్న వార్తలతో సినిమాపై క్యూరియాసిటీ అమాంతం పెరిగి పోతుంది. సిద్ధాంత్ చతుర్వేది, మోహిత్ రైనా లీడ్ రోల్స్‌లో నటించనున్న ఈ మూవీ ప్రీ ప్రొడక్షన్ పనులు కొనసాగు తున్నాయి. ఈ ఏడాది అక్టోబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ షురూ కానున్నట్టు- సమాచారం. మేకర్స్ ఈ చిత్రాన్ని 2026లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారట. ఇక హీరోయిన్‌గా సరైన బ్రేక్ అందుకోలేకపోయిన నేహాశర్మ దర్శకురాలిగా మంచి సక్సెస్ అందుకోవాలని అందరూ విష్ చేస్తున్నారు.

# విశ్వంభర మరోమారు వాయిదా

## వచ్చే ఏడాదికి మార్చినట్లు చిరు వెల్లడి



టాకీస్: మెగాస్టార్ చిరంజీవి హీరోగా రూపొందుతున్న చిత్రం 'విశ్వంభర' సినిమాకు వశిష్ఠ దర్శకత్వం వహిస్తుండగా, చిత్రంపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ చిత్రం ఇప్పటికే చాలా సార్లు వాయిదా పడింది. వాస్తవానికి 2025 సంక్రాంతికే ఈ సినిమా రిలీజ్ కావల్సి ఉన్నా సమ్మర్‌కి పోస్ట్ పోన్ చేశారు. అయితే ఇప్పటికే మూవీకి సంబంధించి విడుదలైన గ్లింప్స్ కి నెగిటివ్ రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా వి.ఎఫ్.ఎక్స్ గురించి చాలా నెగిటివ్ కామెంట్స్ వినిపించాయి. దీంతో నిర్మాతలు క్వాలిటీ- విషయంలో కాంప్రమైజ్ కాకూడదు అని భావించి మూవీని అత్యద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. క్వాలిటీ- ఔట్‌పుట్ తోనే సినిమాని జనాల్లోకి వదలాలని భావించారు చిత్ర బృందం. కొద్ది సేపటి క్రితం యూవీ క్రియేషన్ చిన్న వీడియోని విడుదల చేయగా, ఇందులో చిరంజీవి ఆసక్తికర విషయాలు తెలియజేశారు. మూవీ ఆలస్యానికి కారణం మీకు అత్యున్నత ప్రమాణాలతో, బెస్ట్ క్వాలిటీతో మూవీని మన ముందుకు తీసుకురావాలనే చిత్ర బృందం ఇంత సమయం తీసుకుంటుందని చిరంజీవి అన్నారు. ఇది చందమామ కథలాగా సాగిపోయే అద్భుతమై కథ. చిన్న పిల్లలతో పాటు- పెద్దవాళ్లలో ఉండే చిన్న పిల్లలకి ఈ సినిమా బాగా నచ్చుతుంది అని చిరంజీవి అన్నారు. ఇక మూవీని 2026 సమ్మర్‌కి విడుదల చేయనున్నట్టు చిరంజీవి స్వయంగా చెప్పుకొచ్చారు.

మూవీ విషయానికి వస్తే.. ఈ చిత్రం భారత పురాణాల ఆధారంగా రూపొందుతున్న ఫాంటసీ యాక్షన్ అడ్వెంచర్. 'మన పురాణాల ప్రకారం మొత్తం 14 లోకాలు ఉన్నాయని చెబుతారు. యమలోకం, పాతాళం, స్వర్గం వంటి వాటి వరకు సినిమాల్లో చాలామంది చూపించారు. కానీ 'విశ్వంభర'లో ఆ 14 లోకాలకు మూలమైన 'సత్యలోకాన్ని' చూపించబోతున్నాం అని ఇటీవల దర్శకుడు చెప్పుకొచ్చారు. ఈ కథలో కథానాయకుడు ఆ లోకానికి ఎలా వెళ్తాడు? అక్కడి నుంచి కథానాయికను భూమిపైకి ఎలా తీసుకొస్తాడు? అన్న అంశం చుట్టూ సినిమా ఉంటుందని చెప్పాడు. ఇది ఒక రకమైన మిస్టిక్ యాత్రగా ఉంటుందని సమాచారం. ఈ సినిమా కోసం భారీ బడ్జెట్‌తో అద్భుతమైన సెట్స్ వేసి చిత్రీకరణ జరుపుతున్నట్టు- చిత్రబృందం వెల్లడించింది. ప్రతీ సన్నివేశం గొప్ప విజువల్ ఎఫెక్ట్స్‌తో కూడి ఉండేలా డిజైన్ చేస్తున్నారు. అందుకే ఇది చిరంజీవి కెరీర్‌లోనే అత్యంత విజువల్‌గా రిచ్ సినిమా అవుతుందని భావిస్తున్నారు. చిరంజీవికి జోడీగా త్రిష నటించగా, మరో కీలక పాత్రలో ఆషికా రంగనాథ్ కనిపించనున్నారు. యూవీ క్రియేషన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నప్పటికీ, ఇది పాన్ ఇండియా స్థాయిలో తెలుగుతో పాటు- ఇతర భాషలలో కూడా విడుదల కానుంది.

# శ్రీవారిని దర్శించుకున్న నాగచైతన్య దంపతులు



టాకీస్: సినిమా ఇండస్ట్రీకి చెందిన నటీనటులు పెళ్లైన తర్వాత జీవిత భాగస్వాములతో కలిసి పుణ్యక్షేత్రాలు సందర్శించడం సాధారణం. అయితే, ఈ రోజు ఉదయం హీరో నాగచైతన్య తన భార్య శోభిత ధూళిపాళ్లతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్న వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. నాగచైతన్య-శోభిత జంట సామాన్య భక్తుల లాగే క్యూ లైన్‌లో నిలబడి దర్శనానికి వెళ్లారు. వీడియోలో నాగచైతన్య సంప్రదాయ పట్టు వస్త్రాలు ధరించగా, శోభిత ఎరుపు రంగు చీరలో, నుదుటిన బొట్టు, చేతులకు గాజులతో అచ్చ తెలుగింటి ఆడపిల్లలా కనిపించారు. ఆమె ధరించిన చీర, పాపిట సింధూరం చూసి నెటిజన్లు "సింప్లిసిటీకి ప్రత్యేక నిర్వచనం శోభిత" అంటూ కామెంట్లు చేస్తున్నారు.

సెలబ్రిటీలు అయినా సామాన్య భక్తుల్లాగే దర్శనానికి వెళ్లిన విధానం నెటిజన్లను ఆకట్టుకుంటోంది. అందుకే ఈ జంటపై ప్రశంసల వర్షం కురుస్తోంది. గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో వారిరివురు శ్రీవారి సేవలో పాల్గొన్నారు. దర్శనం అనంతరం దంపతులకు వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. భార్య శోభిత చేయి విడవకుండా హీరో చైతూ నడవడం అందరి దృష్టిని ఆకర్షించింది. దర్శనం అనంతరం నాగచైతన్య, శోభిత ఆలయ నుంచి బయటకు రాగా.. చూడటానికి భక్తులు ఎగబడ్డారు. వారితో ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపారు.

నాగచైతన్య, సమంత విడాకుల తర్వాత శోభితతో డేటింగ్ చేస్తున్నారని పలు వార్తలు రావడం, అనంతరం గతేడాది డిసెంబర్‌లో అన్నపూర్ణ స్టూడియోలో పెళ్లి వేడుక చేసుకోవడం మనం చూశాం. అయితే తాజాగా తిరుమల దర్శనంతో మరోసారి ఈ జంట సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతున్నారు. సినిమాల విషయానికి వస్తే 'తండేల్' సినిమాతో హిట్ కొట్టిన నాగచైతన్య ప్రస్తుతం కార్తీక్ వర్మ దండు డైరెక్షన్‌లో వర్కింగ్ టైటిల్‌తో ఓ సినిమా చేస్తున్నారు. ఇందులో హీరోయిన్‌గా శ్రీలీల లేదా పూజా హెగ్డేను తీసుకునే చర్చలు జరుగుతున్నట్టు సమాచారం. ఇక శోభిత ప్రస్తుతం తమిళ డైరెక్టర్ పా. రంజిత్ తెరకెక్కిస్తున్న వేట్టవం చిత్రంలో నటిస్తున్నట్టు సమాచారం. అంతేకాక, సురేష్ ప్రొడక్షన్ బ్యానర్‌లో ఓ లేడీ ఓరియంటెడ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ చిత్రంలో నటిస్తున్నట్టు ఇండస్ట్రీలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

# ఎస్ఎస్ఎంబీ 29 కోసం జక్కన్న స్కెచ్ మామూలుగా లేదు..

## ఏకంగా అవతార్ డైరెక్టర్‌తో అదిరిపోయే ప్లాన్..!



టాకీస్: గ్లోబల్ స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి, మహేశ్ బాబు కాంబోలో వస్తోన్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ ఎస్ఎస్ఎంబీ 29 ఆఫ్రికన్ గ్లోబల్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ మూవీలో బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్వీరాజ్ సుకుమారన్ మరో కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ సినిమా కోసం ఏదో ఒక వార్త నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రానికి సంబంధించి ఇప్పుడొక ఆసక్తిక వార్త ఫిలింనగర్‌లో చక్కర్లు కొడుతోంది. ఆగస్టు 9న మహేశ్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఎస్ఎస్ఎంబీ 29 ఫస్ట్ లుక్, టైటిల్ అనౌన్స్‌మెంట్ ఉంటుందని అంతా ఆసక్తిగా ఎదురుచూశారు. కానీ ఎస్ఎస్ రాజమౌళి మాత్రం ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్ ఈ ఏడాది నవంబర్‌లో రాబోతున్నట్టు ప్రకటించాడు. అయితే జక్కన్న ప్రత్యేకించి నవంబర్ అని చెప్పడానికి పెద్ద కారణమే ఉందట. ఇంతకీ అదేంటనుకుంటున్నారా..? హాలీవుడ్ లెజెండరీ డైరెక్టర్ జేమ్స్ కామెరాన్ అవతార్ ఫ్రాంచైజీలో తెరకెక్కిస్తున్న డిసెంబర్ 19న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రాబోతుందని తెలిసిందే. అయితే ఈ మూవీ ప్రమోషన్స్ కోసం జేమ్స్ కామెరాన్ భారత్‌కు రానున్నాడు. జేమ్స్ కామెరాన్ వచ్చే టైంనే తన ప్రమోషన్స్ కోసం వాడాలని ఫిక్స్ అయ్యాడట రాజమౌళి. అవును మీరు చదివింది నిజమే. జక్కన్న ఈ సారి ఏకంగా జేమ్స్ కామెరాన్‌తో ఎస్ఎస్ఎంబీ 29 ఫస్ట్ లుక్, గ్లింప్స్ లాంచ్ చేసేందుకు ప్లాన్ చేశాడన్న వార్త ఇప్పుడు ఇండస్ట్రీ సర్కిల్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఎస్ఎస్ రాజమౌళి సినిమా అంటే పబ్లిసిటీ, ప్రమోషన్స్ ఎలా ఉంటాయో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఎస్ఎస్ఎంబీ 29 ఫస్ట్ గ్లింప్స్‌ను ఏకంగా ప్రపంచవ్యాప్తంగా పాపులారిటీ ఉన్న జేమ్స్ కామెరాన్‌తో లాంచ్ చేయించి వరల్డ్ మూవీ లవర్స్ ఫోకస్‌ను తనవైపునకు తిప్పుకునేలా భారీ స్కెచ్ వేశాడని అర్థమవుతోంది. ఏదైనా ప్రమోషనల్ స్ట్రాటజీలో తనదైన మార్క్ చూపించే ఇండియన్ ఫిలిం డైరెక్టర్లలో జక్కన్న టాప్ 1లో ఉంటారనడంలో ఎలాంటి సందేహం లేదు.

# ఓటీటీ తెరపైకి వచ్చేసిన 'సూత్రవాక్యం'



టాకీస్: ఓటీటీ సెంటర్స్ లో ఇప్పుడు మలయాళం కంటెంట్ కి మంచి క్రేజ్ ఉంది. మలయాళం నుంచి వచ్చిన సినిమాలను చూడటానికి ప్రేక్షకులు ఎక్కువ ఆసక్తిని కనబరుస్తున్నారు. తెలుగు ఆడియోతో వస్తున్న మలయాళ సినిమాల సంఖ్య కూడా పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో మలయాళం నుంచి మరో సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా పేరే 'సూత్ర వాక్యం'. షైన్ టామ్ చాకో ప్రధానమైన పాత్రను పోషించిన ఈ సినిమా, జులై 11వ తేదీన థియేటర్లకు వచ్చింది. కొత్త పాయింటును టచ్ చేసిన కంటెంట్ గా ఈ సినిమాను గురించి చెప్పుకున్నారు. అలాంటి ఈ సినిమా ఇప్పుడు 'ఈటీవీ విన్' ఓటీటీ ట్రాక్ పైకి వచ్చింది. ఈ రోజు నుంచి ఈ సినిమా అందుబాటులోకి వచ్చింది. యూజియన్ జాస్ చిరమ్మల్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో, క్రిస్టో జేవియర్ అనే పోలీస్ ఆఫీసర్ పాత్రలో షైన్ టామ్ చాకో కనిపిస్తాడు. అతను పిల్లలకు ట్యూషన్స్ చెబుతూ వాళ్లకి దగ్గరవుతాడు. అలాగే తన పట్ల నిమీషకి గల చెడు అభిప్రాయాన్ని కూడా అతను మారుస్తాడు. ఆ తరువాత వివేక్ అనే కుర్రాడు కనిపించకుండా పోవడం, బెట్సీ అనే అమ్మాయి చనిపోవడం జరుగుతుంది. అందుకు కారకులు ఎవరు? అనే అంశం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఓటీటీ వైపు నుంచి ఈ కంటెంట్ మంచి మార్కులు కొట్టేసే ఛాన్స్ అయితే ఉంది.

# కాజోల్ హార్రర్ థ్రిల్లర్ 'మా' డిజిటల్ డెబ్యూ..

టాకీస్: ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న టాలెంటెడ్ హీరోయిన్ల జాబితాలో ఫస్ట్ ప్లేస్‌లో ఉంటుంది బాలీవుడ్ భామ కాజోల్. ఈ ఏడాది జూన్‌లో మైథలాజికల్ హార్రర్ థ్రిల్లర్ మా సినిమాతో థియేటర్లలోకి వచ్చింది కాజోల్. అజయ్ దేవగన్ నిర్మించిన ఈ చిత్రానికి బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ రివ్యూస్ వచ్చాయి. విశాల్ ఫురియా డైరెక్ట్ చేసిన ఈ చిత్రం సైతాన్ యూనివర్స్‌లో వచ్చిన మా ప్రాజెక్ట్ బాక్సాఫీస్ వద్ద రూ.51.64 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టింది. థియాట్రికల్ రన్ పూర్తి చేసుకున్న ఈ మూవీ ఇక ఓటీటీలో తన లక్‌ను పరీక్షించుకునేందుకు ఆగస్టు 22న (నేడు) డిజిటల్ ఎంట్రీ ఇచ్చింది. ప్రస్తుతం పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతున్నట్టు ఓటీటీ ప్లాట్‌ఫాం అధికారికంగా ప్రకటించింది. అయితే నెట్‌ఫ్లిక్స్‌లో మా డబ్బింగ్ వెర్షన్లు ఎప్పటినుంచి అందుబాటులోకి వస్తాయనేది తెలియాల్సి ఉంది. మరి నెట్‌ఫ్లిక్స్‌లో హార్రర్ థ్రిల్లర్‌కు ప్రేక్షకులు ఎలా స్పందిస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఈ మూవీలో రోనిత్ రాయ్, ఇంద్రనీల్ సేన్ గుప్తా, ఖెరిన్ శర్మ, జితన్ గులాటి, జితేంద్ర కుమార్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రాన్ని దేవగన్ ఫిల్మ్స్, జియో స్టూడియోస్, పనోరమ స్టూడియోస్ బ్యానర్లపై అజయ్ దేవగన్, జ్యోతి దేశ్ పాండే, కుమార్ మంగత్ పాఠక్ సంయుక్తంగా తెరకెక్కించారు.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.